ఎరుపెక్కిన రోడ్డు..భయాందోళనలో స్థానికులు

-జీడిమెట్లలో మ్యాన్‌హోల్ నుంచి ఉబికి వచ్చిన ఎరుపు రంగు నీరు

-ట్యాంకర్లతో తెచ్చి మూసీలో కలుపుతున్న కెమికల్ వ్యర్థాలు



హైదరాబాద్, నవంబరు 26 ప్రభాతవార్త

అక్కడ హత్యలు.. రోడ్డు ప్రమాదాలు జరగలేదు. కానీ ఆ దారుల్లో ఎరుపు రంగుతో నీరు వరదలా ప్రవహించింది. చూసేందుకు రక్తం మాదిరే ఉంటంతో ఏంటా ఎరుపు రంగు అని స్థానిక ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఎవరైనా ఎక్కడైనా హత్యకు గురయ్యారా లేక జంతువుల వధ నిర్వహించారా అని ఆలోచనలో పడ్డారు. చూస్తూ ఉంటే అక్కడ ప్రజలు భరించలేని దుర్గంతమైన వాసన వెలువడింది. ఏంటా వాసన అని.. ఊపిరిసడలక ముక్కు మూసుకున్నారు. చివరికి విషయం తెలిసి కాస్త ఊపిరి పీల్చుకున్నా.. వాసన మాత్రం భరించలేకపోయారు. ఇంతకీ ఎరుపు రంగు ఎక్కడి నుంచి వచ్చిందో తెలుసా?.. హైదరాబాద్‌లోని జీడిమెట్ల పారిశ్రామికవాడను ఆనుకొని ఉన్న సుభాష్‌నగర్ డివిజన్ వెంకటాద్రినగర్‌లో సోమవారం సాయంత్రం మ్యాన్‌హోల్ నుంచి ఎరుపు రంగు నీరు ఒక్కసారిగా ఉబికి వచ్చింది. ఆ నీరు రెండు రోడ్లలో పారుతూ తీవ్ర దుర్గంధం రావడంతో నివాసితులు ఊపిరి తీసుకునేందుకు ఉక్కిరిబిక్కిరయ్యారు. ఇంతకీ ఏంటా ఎరుపు రంగు అని, ఎక్కడి నుంచి వస్తుందోనని ఎరుపు రంగు పారిన రోడ్డు వెంబడి కొందరు వెళ్లారు.

మ్యాన్‌హోల్ నుంచి ఎరుపు రంగు నీరు..

కాలనీలో కొంతమంది రీసైక్లింగ్ పరిశ్రమలను నిర్వహిస్తూ రసాయనాల డ్రమ్ములను కడిగి నాలాల్లో పారబోయడం వల్లనే ఈ పరిస్థితి ఏర్పడిందని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై పలుమార్లు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు పట్టించుకుని అనుమతులు లేకుండా ఇండ్ల మధ్యలో నడుస్తున్న పరిశ్రమలను మూసివేయించాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.

లారీల్లో తీసుకొచ్చి కెమికల్స్‌ను మూసీలో కలుపుతున్న నిర్వాహకులు..

కంపెనీల నుంచి వచ్చిన విషపూరితమైన కెమికల్స్‌ను గుట్టుచప్పుడు కాకుండా ప్రణాళిక ప్రకారం రాజేంద్రనగర్ పోలీస్ లిమిట్స్‌లోని బాపూ ఘాట్‌కు తరలించిన లారీనీ స్థానికులు పక్కా సమాచారంతో పట్టుకున్నారు. అర్ధరాత్రి సమయంలో ప్రతి రోజు 5 నుంచి 10 ట్యాంకర్ల కెమికల్ వేస్టేజ్‌ను తీసుకొని వచ్చి వారు ఏర్పరచుకున్న డ్రైనేజ్ ద్వారా విషపూరితమైన కెమికల్‌ను మూసీ నదిలో కలుపుతున్నారని స్థానికులు తెలిపారు. ఖచ్చితమైన సమాచారంతో స్థానికులు కాపు కాసి ఇవాళ వారిని పట్టుకున్నారు. ఓవైపు ప్రభుత్వం మూసీ నది శుద్ధీకరణ చేస్తుంటే..మరోవైపు కొందరు దుండగులు ఇలా చేయడం ఎంతవరకు సమంజసమని స్థానికులు ప్రశ్నించారు.ఈ కెమికల్ నీరు తాగి స్థానికులు అనారోగ్య సమస్యలతో పాటు అనేక సమస్యలు తలెత్తుతున్నాయని వాపోయారు. ఈ విషయాన్ని చిన్న విషయంగా పరిగణించాలని..బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జీడిమెట్ల ఎస్ఎస్‌వి ప్లాస్టిక్ కంపెనీలో భారీ అగ్నిప్రమాదం



కుత్బుల్లాపూర్, నవంబరు 26 ప్రభాతవార్త

జీడిమెట్ల పారిశ్రామికవాడలోని ఓ ప్లాస్టిక్ సంచుల తయారీ కంపెనీలో ఒక్క సారిగా అగ్నిప్రసమాదం చోటుచేసుకుని భారీ అగ్నిఖిలలు ఎగిసిపడుతున్నాయి.. జీడిమెట్ల పారిశ్రామికవాడ నుండి దూలపల్లి దారిలో గల ఎస్ఎస్‌వి ప్లాస్టిక్ బ్యాగుల తయారీ కంపెనీలో మంగళవారం మధ్యాహ్నం వంటిగంటన్నర సమయంలో ఈప్రమాదం మూడవ అంతస్థులో చోటుచేసుకుని మొదటి అంతస్థుకు మంటలు వ్యాపించాయి. మొదట రెండు ఫైర్ఇంజన్లతో మంటలను అదుపుచేసేందుకు ఫైర్ ఇంజన్ల అదికారులు యత్నించినా ఫలితంలేకపోవడతో ఒక్కక్కొటిగా జీడిమెట్ల, సనత్‌నగర్, షామీర్‌పేట ఫైర్‌స్టేషన్ల నుండి ఆరు ఫైర్ ఇంజన్లను తెప్పించి మంటలను ఆర్పేందుకు పోరాడారు. జీడిమెట్ల పోలీసు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్‌తోపాటు సబ్‌ఇన్‌స్పెక్టర్‌లు ప్రేమ్‌సాగర్, సత్యనారాయణలు తమ సిబ్బందితో ప్రత్యేక చర్యలు చేపట్టడంతో పాటు ఫైర్ఇంజన్ల సిబ్బంది, డి.ఆర్.ఎఫ్ సిబ్బంది మంటలను ఆర్పేందుకు యత్నించారు. బాలానగర్ సహాయ పోలీసు కమిషనర్ హనుమంతరావు ఘటనా స్థలానికి హుటాహుటిన చేరుకుని సమాచారాన్ని ఎప్పటికప్పుడు సేకరిస్తు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందిని అప్రమత్తం చేశారు. అగ్నిప్రసమాద ఘటన జరుగుతున్న సమయంలో కార్మికులు ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పిందని ఆయన తెలిపారు. కంపెనీలో ఉండాల్సిన సామర్థంకన్నా ఎక్కువ ముడి సరుకు నిలువలు వుండటంతో మంటలను ఆర్పేందుకు ఎక్కువసమయం పట్టిందని తెలిపారు. ప్లాస్టిక్‌బ్యాగుల తయారీ కంపెనీ కావడంతో ముడిసరుకు తక్కువసమయంలో అంటుకుని ఉవ్వెత్తున మంటలు ఎగిసిపడ్డట్లు వారు భావిస్తున్నారు. మొదట మోడవ అంతస్తులో షార్ట్‌సర్క్యూట్‌లో మంటలు ప్రారంభమై క్షణాల్లోనే వ్యాపించి ఉండవచ్చునని అధికారులు భావిస్తున్నారు. సుమారు 60ట్యాంకర్ల నీటిని ఆరు ఫైర్ ఇంజన్లద్వారా మంటలను ఆర్పేందుకు యత్నించినా మంటలు అదుపులోకి రాకపోవడంతో మంగళవారం రాత్రి వరకు అధికారులు శ్రమిస్తూనే ఉన్నారు. అగ్నిప్రమాద సమయంలో యజమాని అందుబాటులో లేకపోవడంతో ఆస్థినష్టానికి సంబందించిన వివరాలు తెలియరాలేదు. ఈమేరకు జీడిమెట్ల సర్కిల్ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్ ఆధ్వర్యంలో సబ్‌ఇన్‌స్పెక్టర్లు ప్రేమ్‌సాగర్, సత్యనారాయణలు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సంఘటనా స్థలానికి ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ మనోహార్‌రెడ్డి తమ సిబ్బందితో వచ్చి పరిస్థితిని పరిశీలించారు.

ఫ్లైఓవర్ పనులను త్వరగా పూర్తి చేయాలి

-జిహెచ్ఎంసి కమీషనర్ ఇలంబర్తి

-ఆరాంఘర్ నుంచి జూపార్కు వరకు పనుల పరిశీలన

ఫ్లైఓవర్‌పై నడుస్తూ పనులు పరిశీలిస్తున్న కమిషనర్ ఇలంబర్తి, సర్పరాజ్ అహ్మద్, సిఈ దేవానంద్ తదితరులు

హైదరాబాద్, నవంబర్ 26,ప్రభాతవార్త:

ఆరాంఘర్ నుండి జూపార్కు వరకు నిర్మాణంలో ఉన్న ఫ్లైఓవర్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ కమీషనర్ ఇలంబర్తి అధికారులను ఆదేశించారు. మంగళవారం హెచ్ఎండీఏ కమిషనర్ సర్పరాజ్ అహ్మద్, వాటర్ వర్క్స్ ఈడీ మాయంక్ మిట్టల్, ఇతర అధికారులతో కలిసి ఫ్లైఓవర్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమీషనర్ కాలి నడకన ఆరాంఘర్ ఫ్లైఓవర్ పనులు పరిశీలించారు. ప్రధాన ఫ్లైఓవర్ పనులు నవంబర్ 30 వరకు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సర్వీస్ రోడ్డు నిర్మాణానికి మొత్తం 17 ఆస్తులు సేకరించాలని, ప్రస్తుతం పని జరిగేందుకు 5 ఆస్తులు సత్వరమే సేకరణ చేసిన పక్షంలో సర్వీస్ రోడ్డు పనులు ప్రారంభించే అవకాశం ఉంటుందని సి.ఈ దేవానంద్ కమీషనర్ కు వివరించారు. సమస్య పరిష్కారం కోసం జోనల్ టౌన్ ప్లానింగ్ అధికారులను వెంటనే చర్యలు తీసుకోవాలని, నష్టం పరిహారం చెల్లింపుకు సంబంధిత ప్రతిపాదనను త్వరగా పంపిస్తే వెంటనే మంజూరు చేస్తానని కమిషనర్ హామీ ఇచ్చారు. జోనల్ కమిషనర్ వెంకన్నకు పనులు రెండు రోజుల్లో పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.

ఈ పర్యటనలో ఎస్ఈ దత్తు పంతు, జోనల్ కమిషనర్ వెంకన్న, డిప్యూటీ కమిషనర్లు రవి కుమార్, అరుణ, నిని, డిప్యూటీ నినిలు తదితరులు పాల్గొన్నారు.

పదోతరగతి పరీక్షల్లోనూ మెరుగైన ఫలితాలు సాధించాలి

-ఎఫ్ఆర్ఎస్ హాజరులో హైదరాబాద్‌కు ద్వితీయ స్థానం

"కాఫీ విత్ కలెక్టర్ " కార్యక్రమంలో అనుదీప్ దురిశెట్టి

కాఫీవిత్ కలెక్టర్ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులతో సమావేశమైన కలెక్టర్ అనుదీప్‌దురిశెట్టి

హైదరాబాద్,నవంబర్ 26,ప్రభాతవార్త:

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణ, మార్గదర్శనం, ప్రయత్నంతో ఎఫ్ ఆర్ఎస్ (ఫేస్ రికగ్నేషన్ సిస్టం)లో పిల్లల హాజరు శాతం పెరిగి రాష్ట్రంలో హైదరాబాద్ జిల్లా ద్వితీయ స్థానంలో నిలిపినందుకు ప్రధానోపాధ్యాయులకు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అభినందించారు.మంగళవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో పాఠశాలల్లో ఎఫ్ఆర్ఎస్ యాప్ లో విద్యార్థుల హాజరు శాతం ఈ వారం పెంచిన 10పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఏర్పాటు చేసిన "కాఫీ విత్ కలెక్టర్ "కార్యక్రమంలో డిఈఓ ఆర్.రోహిణితో కలసి కలెక్టర్ పాల్గొన్నారు. హైదరాబాద్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో అత్యధికంగా పిల్లల హాజరు శాతం పెంపొందించినందుకు కలెక్టర్ అట్టి ఉపాధ్యాయులను పిలిపించి వారితో కలసి కాఫీ సేవించారు. పాఠశాలల్లో హాజరు శాతం పెంచడం తోపాటు పిల్లలకు నాణ్యమైన విద్యా బోధన జరిగేలా ఉపాధ్యాయులు పిల్లలతో అనుబంధం పెంచుకోని వారికి మంచి భవిష్యత్తు ఇవ్వాలన్నారు. ఎఫ్ఆర్ఎస్ హాజరులో రాష్ట్రంలోనే హైదరాబాద్ జిల్లాను అక్టోబర్ 21 నుండి 26 వరకు మొదటి స్థానంలో, ఇప్పుడు ద్వితీయ స్థానంలో నిలిపినందుకు అభినందించారు. పాఠశాలల్లో పిల్లల హాజరు శాతం, పదవ తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలన్నారు. ఈవారం పాఠశాలల్లో హాజరు శాతం బాగా పెంచిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల రహీం పూర పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆనంద్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల కాచిగూడ హెచ్ఎం వరప్రసాద్ రెడ్డి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల మాదన్నపేట్ హెచ్ఎమ్ ఆర్. లక్ష్మి, తిరుమలగిరి బాలికలు ఉన్నత పాఠశాల హెచ్ ఎం లు విష్ణు వర్ధన్ రెడ్డి, బాబిత దేవి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల రాజ్ భవన్ హెచ్ఎం వి ఏ ఎస్ కరుణ శ్రీ, గోపాల్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎల్లారెడ్డి గూడ హెచ్ఎం మెర్సీ, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల కోట్ల అలీజ అజీమ్ సాజిద్, ఇక్బాల్ ఖదీర్, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల లాలాపేట్ మార్కెట్ హెచ్ఎం ప్రతాప్ రెడ్డి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎర్రమంజిల్ హెచ్ఎం ఏ వెంకట్ రెడ్డి, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల చిక్కడ పల్లి హెచ్ఎం పి భవాని,10 పాఠశాలల ప్రధానోపద్యాయుల పని తీరు చాలా బాగుందని ప్రశంసిస్తూ, హాజరు శాతం మరింత పెరిగేలా కృషి చేయాలన్నారు.

అనంతరం ప్రధాన ఉపా ధ్యాయులతో కాఫీ సేవిస్తూ వారితో ఇష్ట గోష్టి గా మాట్లాడారు. వారి పనితీరు, అనుభవాలు తెలు సుకొని వారి సేవలకు ప్రశంసించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా అధి కారి ఆర్. రోహిణి తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ వార్త



రోప్ ఆపరేషన్ ఇక నిరంతరం

- సిపి సివి ఆనంద్

వంజగుట్ట, నవంబర్ 26 (ప్రభాతవార్త):

నగరంలో ఫుట్‌పాత్‌లను షాపుల యజమానులు రెంట్‌కు ఇస్తున్నారని, ఇది ఒక మాఫియాలా తయారైందని నగర పోలీసు కమీషనర్ సీవీఆనంద్ వ్యాఖ్యానించారు. నగర ట్రాఫిక్ పోలీసు విభాగం ఆధ్వర్యంలో మంగళవారం టోలీచౌకి ప్రాంతంలో ఆపరేషన్ రోప్‌వే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్యను ఎదుర్కొంటున్నామని, సోషల్ మీడియా ద్వారా చాలామంది ఫిర్యాదులు చేస్తున్నారన్నారు. నగరంలో తాను ట్రాఫిక్ అడినల్ సీపీగా మూడేళ్ళు పనిచేశానని గుర్తు చేసుకున్నారు. హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసు శాఖ సరిగా పనిచేస్తే మొత్తం నగర ప్రజలకు ఊరట కలుగుతుందన్నారు. అందుకే ఈ విభాగం చాలా కీలకమైందన్నారు. నా విజ్ఞప్తి ఏంటంటే మూడు కమీషనరేట్‌ల పరిధిలో రోజుకు 1500 వాహనాలు రిజిస్ట్రేషన్ అయి రోడ్లపైకి వస్తున్నాయన్నారు. మొత్తం 88 లక్షల వాహనాలు రోడ్లపై నిత్యం తిరుగుతున్నాయన్నారు. వాహనాలు పెరుగుతున్నాయి కానీఅందుకు అనుగుణంగా రోడ్లు పెరగకపోవడంతో రద్దీ ఏర్పడి ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయని వివరించారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలు, రాజకీయనాయకులు,అన్ని శాఖల అధికారులు సహకరించాలని అపుడు సమస్యకు పరిష్కారం దొరుకుతుందని వ్యాఖ్యానించారు. రాజకీయ నాయకులు సహకారం లేకపోయినా కొన్ని సమస్యలు ఏర్పడతాయన్నారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యేను ఆహ్వానించినా ఆయన ఎందుకో రాలేదన్నారు. ఫుట్‌పాత్‌లపై అనేకంగా ఆక్రమణలు వవెలిశాయని, వాటిని తొలగిస్తున్నపుడు తామంతా పేదవాళ్ళం మేము ఎలా బతకాలని వారు అంటున్నారన్నారు. కానీ ఎవరూ అడగని పరిస్థితుల్లోనే ఈ ఆక్రమణలు వెలుస్తున్నాయన్నారు. వాటిని తొలగిద్దామన్నా ఎవరో ఒకరు అడ్డుపడి ఆపుతున్నారని, కొన్ని షాపుల యజమానులు ఫుట్‌పాత్‌లపై స్థలాన్ని రెంట్‌కు ఇస్తున్నారని, నగరంలో ఇది ఒక మాఫియాలా తయారైందని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. దీని వల్ల కూడా ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందన్నారు. అందుకే ఆపరేషన్ రోప్ ద్వారా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ట్రాఫిక్ సమస్యను అధిగమించాలంటే ఆపరేషన్ రోప్‌ను ప్రజాప్రతినిధుల సహాయంతో బలంగా ముందుకు తీసుకువెళ్ళాలని అధికారులకు సూచించారు. ప్రజా ప్రతినిధులు, ఇతరులు అంతా సమస్యపై ఫిర్యాదులు చేస్తున్నారని వారంతా ఆక్రమణల తొలగింపుకు సహకరించాలన్నారు. ఫుట్‌పాత్‌ల ముందు రోడ్లను కూడా కొంచెం కొంచెం ఆక్రమిస్తున్నారని, దీని వల్ల బస్సులు రోడ్ల మధ్యలో ఆగుతున్నాయని అన్నారు. ఆటో డ్రైవర్‌లు కూడా ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్ చేస్తున్నారని ఈ విషయంలో కూడా అవగాహన కల్పిస్తామన్నారు. వీఐపీ మూమెంట్ కూడా కొంత ఇబ్బందిగా మారుతుందని, ట్రాఫిక్ దృష్ట్యా ముఖ్యమంత్రి కూడా నాకు గ్రీన్‌ఛానల్ అవసరంలేదని చెబుతున్నారని వివరించారు. సర్పంచ్‌ల దగ్గర నుంచి మాజీ ఎమ్మెల్యేలు ఇంకా అనేకమంది వాహనాలకు సైరన్‌లు పెట్టుకుంటున్నారని, దీనివల్ల పోలీసులపై వత్తిడి పెరుగుతూ ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. అందుకే వీటిపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం జరుగతుందని తెలిపారు. రెడ్‌లైట్, బ్లూలైట్,సైరన్‌లు ఎవరూ వాడకూడదని,పోలీసు పెట్రోలింగ్ చేసే వారు తప్ప ఎవరూ వాడకూడదని ఆయన సూచించారు. ఎవరైనా ఇవి ఉంటే వెంటనే తొలగించుకుని పోలీసులకు సహకరించాలన్నారు. నగరంలో రోప్ ఆపరేషన్ నిరంతరంగా కొనసాగుతుందని సీపీ తెలిపారు.

డబ్బులు డిమాండ్ చేస్తున్న ట్రాన్స్‌జెండర్‌లు అరెస్ట్

వంజగుట్ట, నవంబరు 26 ప్రభాతవార్త:

డబ్బులు ఇవ్వాలని ఇంటి కొత్త ఇంటి ఓనర్‌ను డిమాండ్ చేస్తున్న ట్రాన్స్‌జెండర్‌లను జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..నందగిరి హిల్స్‌లో హౌస్‌వార్మింగ్ ఫంక్షన్ జరుగుతుంది. ఈ ఫంక్షన్‌కు కుక్కపిల్ల,కుషిచౌహాన్, మోహిని, అన్ని, అంజలి ,స్టెల్లా రాయ్, సాయి పల్లవి అనే ట్రాన్స్‌జెండర్‌లు అక్కడకు వెళ్ళి నానా హంగామా సృష్టించారు. అంతేగాక అక్కడ నగదును దోచుకోవడానికి ప్రయత్నించడమే కాక నానా రభస సృష్టించారు. ఫంక్షన్‌ను భంగపరిచే యత్నం చేశారు. ఎం తవారించినా వినకుండా గొడవ చేశారు. తాము డిమాండ్ చేసినంత డబ్బు ఇవ్వాలని బెదిరింపులకు దిగారు. ఇంటి యజమాని వెంటనే టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. టాస్క్‌ఫోర్స్ఇన్‌స్పెక్టర్ జంగయ్య జూబ్లీహిల్స్ పోలీసులతో కలసి అక్కడకు వెళ్ళి వారందరినీ అదుపులోకి తీసుకున్నారు. వారిపై కేసునమోదు చేసి జూబ్లీహిల్స్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీఎకు విఐపి నంబర్ ఆంక్షన్‌లో రూ.50లక్షలకు పైగా ఆదాయం

వంజగుట్ట, నవంబర్ 26 ప్రభాతవార్త:

హైదరాబాద్ సెంట్రల్ జోన్ రవాణా శాఖ, ఖైరతాబాద్ కార్యాలయంలో మంగళవారం వాహనాల విఐపి నంబర్‌లకు ఆక్షన్‌లో భారీగా ప్రభుత్వానికి ఆదాయం లభించింది. మొత్తం బిడ్‌లలో టీజీ 09డి0001కు11, 11,11లక్షలకు రుద్రరాజు రాజీవ్‌కుమార్ దక్కించుకున్నారు.టీజీ 09 డి0009 నంబర్‌కు మెఘా ఇంజనీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ వారు 10,40000 వేలకు దక్కించుకున్నారు అదేవిధంగా శ్రీయాన్ కన్‌స్ట్రక్షన్స్ వారు టీజీ 09 సి 9999 నంబర్‌ను 7,19,999 రూపాయలకు దక్కించుకున్నారు. ఇంకా టీజీ 09డి0006 3,65000,టీజీ 09 డి0005 3,45000,టీజీ 09డి 007 ను 2,06,569కు, టీజీ 09 డి0019 1,95,009కు,టీజీ 09 డి 0099 ను 1,85000కు,టీజీ 09డి 0077ను 1,17,789రూపాయలకు నంబర్‌లను దక్కించుకున్నారు. విఐపి నంబర్‌ల ద్వారా మొత్తం ఆదాయం 52,52,283 రూపాయలు రావడం జరిగిందని అధికారులు ప్రకటించారు.

కారులో వస్తారు .. కబుర్లతో ఆకర్షిస్తారు

-గంజాయి, డ్రగ్స్ అమ్ముతూ పట్టుబడ్డ ముగ్గురు నిందితులు

హైదరాబాద్,నవంబర్ 26,ప్రభాతవార్త:

గంజాయి, డ్రగ్స్ ఏది కావాలన్నా.. ఫోన్ చేస్తే చేస్తే చాలు .. ఫలానా చోటికి రండి ..గంజాయి, ఎండిఎంఎ, ఎల్ఎస్‌డీ బాస్ట్స్ ఏది కావాలన్నా ఇస్తామని కస్టమర్లకు ఫోన్లు చేస్తు డ్రగ్స్ అమ్మకాలు జరిపే ముఠాను మంగళవారం ఎక్సైజ్ ఎస్‌టిఎఫ్ పోలీస్‌లు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.. గోల్కండ ఎక్సైజ్ పోలీస్ పరిధిలోని షేక్‌పేట్, టోలీ చౌక్ ప్రాంతాల్లో కార్లలో గంజాయి అమ్మకాలు జరుగు తున్నాయనే సమాచారం మేరకు ఎస్‌టి ఎఫ్ సీఐ చంద్రశేఖర్‌గౌడ్ బృందం మంగళవారం తెల్లవారు జామున తనిఖీలు నిర్వహించారు.ఒక పోర్ట్‌కారులో ఒక యువతి, ఒక వ్యక్తి కూర్చొని ఉన్నారు. మరో వ్యక్తి స్కూటి పై వచ్చి గంజాయి గంజాయి ప్యాకెట్‌ను కారులో ఉన్న వ్యక్తులకు ఇస్తూ ఉండగా ఎక్సైజ్ ఎస్‌టిఎఫ్ పోలీసులు పట్టుకున్నారు. స్కూటిపై వచ్చిన వ్యక్తి వద్ద నుంచి ఒక కిలో గంజాయి స్వాధీనం చేసుకున్న, అనంతరం కారులో తనిఖీలు నిర్వహించగా అందులో 1.700 కేజీల గంజాయి, మొత్తంగా 2.700 గంజాయి, 11గ్రాముల ఎండిఎంఎ, 3 ఎల్ఎస్‌డీ బాస్ట్స్ లభించాయి. పట్టు గంజాయి డ్రగ్స్ విలువ రూ.1,84,500 ఉంటుందని అంచనా వేశారు. కారు, స్కూటి విలువ రూ. రూ. 6లక్షల వరకు ఉంటుందని అంచనా వేశారు.గంజాయి డ్రగ్స్ అమ్మకాలు జరుపుతూ పట్టుబడిన నిందితుల్లో పి.సాయిబాబు, వై వెంకటరెడ్డి, వి. సోనియా ఎలిషా అలియాస్ ప్రియాంకలను అరెస్టు చేసి గోల్కొండ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు.ఈదాడుల్లో ఎస్‌టిఎఫ్ సీఐ చంద్రశేఖర్‌గౌడ్, ఎస్సై శ్రీనివాస్, శ్రీకాంత్, సాయి కుమార్, కరణ్, ప్రసాద్, తరుణి,నిఖిల్, ఉన్నారు.ఒకే చోటు మూడు రకాల డ్రగ్స్‌ను అమ్మకాలు జరుపుతున్న నిందితులను పట్టుకున్న ఈబృందాన్ని ఎన్ ఫోర్స్‌మెంట్ డెరెక్టర్ విబి కమలాసన్‌రెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ అనిల్ కుమార్‌రెడ్డి అభినందించారు.

ప్రజల ఆరోగ్య భద్రత కోసమే తనిఖీలు..

-అధికారులపై బెదిరింపులకు పాల్పడితే చర్యలు తప్పవు

-జిహెచ్ఎంసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ

హైదరాబాద్, నవంబర్ 26,ప్రభాతవార్త:

ప్రజలు ఉపయోగిస్తున్న ఆహార పదార్థాల భద్రత మరియు నాణ్యతను కాపాడే ఉద్దేశ్యంతో, రెగ్యులర్‌గా హోటల్స్, రెస్టారెంట్లను ఆకస్మికంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ తెలిపారు. ఈ నెల 22న చాదర్‌ఘాట్‌లోని ఆజాద్ మార్కెట్‌లో మేయర్ ఆకస్మిక తనిఖీ చేపట్టగా, రెండు డ్రెస్‌డ్ చికెన్ షాపులు అత్యంత అపరిశుభ్ర పరిస్థితుల్లో నిర్వహించబడుతున్నాయని, అక్కడ ఎలుకలు తిరుగుతున్నాయని గమనించామన్నారు. వెంటనే జీహెచ్ఎంసీ అధికారులకు అట్టి షాపులను మూసివేయాలని ఆదేశించినట్లు తెలిపారు. సర్కిల్14 డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ ఆఫ్ హెల్త్,వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్,అసిస్టెంట్ డైరెక్టర్, వెటరినరీ ఆఫీసర్, సర్కిల్14 జీహెచ్ఎంసీ అధికారుల బృందం రషీద్ హుస్సేన్ (స్టాల్ నెం. 3) మరియు కలీమ్ హుస్సేన్‌లు (స్టాల్ నం. 42) నిర్వహిస్తున్న చికెన్ షాపులపై తనిఖీలు చేపట్టారని, ఈ తనిఖీలో, 1600 కంటే ఎక్కువ బ్రాయిలర్ పక్షులు, 30 కిలోల డ్రెస్‌డ్ చికెన్, 7 కిలోల లివర్ కనుగొన్నారని తెలిపారు. ప్రజా ఆరోగ్య భద్రత దృష్ట్యా వెటర్నరీ విభాగం అట్టి చికెన్ మరియు లివర్‌ను స్వాధీనం చేసుకుని, బ్రాయిలర్ పక్షులను రెండు గంటలలోపు తీసుకెళ్లాలని షాప్ యజమానులకు ఆదేశించినట్లు తెలిపారు.

అధికారులను బెదిరించినవారిపై కేసు..

అదే సమయంలో అక్కడి ఓఎమ్మెల్సీ, జీహెచ్ఎంసీ వార్డు మెంబర్లు కొందరు అక్కడకు చేరుకుని, జీహెచ్ఎంసీ అధికారులను బెదిరించారని, స్వాధీనం చేసుకున్న పదార్థాలను కొందరు దుండగులు బలవంతంగా తీసుకుపోయారని ఆమె తెలిపారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గతంలోనూ గోషామహల్ సర్కిల్ వెటర్నరీ ఆఫీసర్ ఇద్దరు షాప్ యజమానులకు పబ్లిక్ హెల్త్ నార్మ్స్ ఉల్లంఘించినందుకు నోటీసులు జారీ చేశారని, ఖైరతాబాద్ జోన్ డిప్యూటీ డైరెక్టర్ సైతం షాప్‌లు ఖాళీ చేయాలని ఆదేశాలు జారీ చేసినప్పటికి షాప్ యజమానులు ఆ నోటీసులు స్వీకరించకుండా తిరస్కరించడంతో, వాటిని గోడపై అతికించడంతో పాటు, రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా పంపించారని తెలిపారు. ప్రజా ఆరోగ్య పరిరక్షణ జీహెచ్ఎంసీ ప్రాథమిక బాధ్యతని,ఆజాద్ మార్కెట్‌లో ఉన్న అనారోగ్యకర పరిస్థితులు,ఎలుకలు తిరుగుతూ ఉండటం, దుర్వాసన వెదజల్లడం శుభ్రత లేకపోవడం ప్రజా ఆరోగ్యానికి తీవ్రమైన ముప్పును కలిగిస్తున్న దృష్ట్యా ఇలాంటి చర్యలు తీసుకోవడం అత్యవసరమైందన్నారు. జీహెచ్ఎంసీలోని అన్ని వ్యాపార స్థావరాలు, షాపుల యజమానులు శుభ్రత, ఆహార నాన్యత ప్రమానాలు పాటించాలని, ప్రజా ఆరోగ్య భద్రతకు సహకరించాలని కోరారు. ఇలాంటి చర్యలను తప్పుగా అర్థం చేసుకోవడం, రాజకీయపరంగా విమర్శించడం ప్రజా ఆరోగ్య లక్ష్యాలను దెబ్బతీస్తుందని ప్రజల ఆరోగ్యం కోసం జీహెచ్ఎంసీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని మేయర్ పేర్కొన్నారు.

పెళ్లి చేసుకుంటానని మోసం చేశాడని సినీ నటుడు శ్రీతేజ్ పై మహిళ ఫిర్యాదు

కెపిహెచ్‌బి కాలనీ, నవంబర్ 26, ప్రభాతవార్త

తెలుగు సినీ నటుడు శ్రీ తేజ్ తనను పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసం చేశాడని ఓ మహిళ కూకట్పల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదును స్వీకరించిన కూకట్పల

వివక్ష లేని ఓటు హక్కు కల్పించింది భారత రాజ్యాంగమే

తెలంగాణ అడ్వకేట్ జేఏసీ నాయకులు పులిగారి గోవర్ధన్‌రెడ్డి

రాజ్యాంగ దినోత్సవ వేడుకలలో న్యాయవాదులు

ముషీరాబాద్, నవంబర్ 26, ప్రభాతవార్త: నాగరిక దేశాలమని తమకు తామే కితాబిచ్చుకునే అమెరికా, బ్రిటన్ వంటి దేశాల లోని పౌరుల సైతం పొందలేని వివక్షలు లేని ఓటు హక్కును మన దేశంలో ప్రతి భారతీయ పౌరునికి కల్పించిన ఘనత భారత రాజ్యాంగానిదేనని తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి కొనియాడారు. మంగళవారం 75వ రాజ్యాంగ దినోత్సవ వేడుకలు అంబేద్కర్ విగ్రహం వద్ద న్యాయ వాదుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ అనిబిసెంట్ మరియు మోతీలాల్ నెహ్రూ అధ్యక్షతన రాజ్యాంగాన్ని రచించటం జరిగిందని, స్వాతంత్ర్యానంతరం రాజ్యాంగ రచన డ్రాఫ్టింగ్ కమిటీకి బిఆర్ అంబేద్కర్ అధ్యక్షతన రచించబడ్డ రాజ్యాంగం 1949, నవంబర్ 26న ఆమోదంపొంది, 1950 జనవరి 26న ఆవిష్కరించబడిందని గుర్తు చేశారు. స్వాతంత్ర్య సమరయోధులైన నాయకులు ఏ హక్కుల కోసం బ్రిటీష్ వారితో పోరాడారో, ఆ హక్కులన్నీ రాజ్యాంగం మనకు అందించిందని తెలిపారు. దేశ పౌరులందరికీ రాజ్యాంగం ద్వారా సంక్రమించిన హక్కులు తెలిసినప్పటికీ వాటి అమలు, రాజ్యాంగ పరిరక్షణ బాద్యత న్యాయవాదులు, న్యాయ వ్యవస్థపైనే ఉంటుందని అన్నారు. రాజ్యాంగ రచనలో భాగస్వాములైన నాయకులకు, న్యాయవాదులకు నమస్సులు తెలియ చేస్తున్నామని పేర్కొన్నారు.

ఇందిపార్కు సబ్‌స్టేషన్ పరిధిలో నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హైదరాబాద్, నవంబర్ 26,ప్రభాతవార్త: విద్యుత్ మరమ్మతుల్లో భాగంగా మంగళవారం పలు ప్రాంతాలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సైఫాబాద్ డివిజన్ -1 ఏడీఈ వినోద్‌కుమార్ ఓప్రకటనలో తెలిపారు. 11కెవి మెయింటనెన్స్,ఎబి స్విచ్చెస్, బ్రీ కటింట్ వర్క్స్,మరమ్మతు పనుల చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందిరాపార్కు సబ్‌స్టేషన్ పరిధిలోని గగన్‌మహాల్ ఫీడర్ పరిధిలో లోయర్ ట్యాంక్‌బండ్ ఏరియా, గగన్‌మహాల్ కాలనీ ఏరియా, బారఫ్‌బాగ్, సాదురాం ఐఆసుపత్రి ఏరియా, బాదంగల్లీ, భారత్‌గ్యాస్ గోడౌన్, దోమల్‌గూడ మార్కెట్ ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు తెలిపారు. అలాగే మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటలవరకు ఇందిరాపార్క్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఏవీ కాలేజీ ఫీడర్ పరిధిలో గల గగన్‌మహాల్ ఏరియా, పోలీస్ అవుట్‌పోస్టు, బాలసాయిబాబా టెంపుల్ ఏరియా, పిజెఆర్ రెసిడెన్సీ,ఏవీ కాలేజీ ఏరియా, బాదమ్‌గల్లీ, జ్యోతి మార్కెట్ ఏరియా ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేయనున్నట్లు తెలిపారు

రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం



సర్కిల్ మూడు రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం

చార్మినార్,నవంబరు 26 ప్రభాతవార్త : హైదరాబాద్ పాతబస్తీ సర్కిల్ మూడు రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షులుగా పురానాపూల్ గల్బవీధికి చెందిన పుస్తె శ్రీ కాంత్ నియమితులయ్యారు.పురానాపూల్‌లో మంగళవారం జరిగిన సర్కిల్ మూడు రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం సమావేశంలో పాతనగరానికి చెందిన రేషన్ డీలర్లు పుస్తె శ్రీ కాంత్‌ను సర్కిల్ మూడు రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా కొత్త అధ్యక్షులు పుస్తె శ్రీ కాంత్ మాట్లాడుతూ రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారం కోసం అన్ని విధాల కృషి చేస్తానని తెలిపారు. త్వరలో అసోసియేషన్ పూర్తి కార్యవర్గాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలియజేశారు.ఈ సమావేశంలో తెలంగాణ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం కోశాధికారి పి.నాగరాజు,జై కిషన్,డీలర్లు పాల్గొన్నారు.

దీపాంకర్ పాల్‌కు సేవా రత్న అవార్డు ప్రధానం

దీపాంకర్ పాల్‌కు సేవా రత్న అవార్డును ప్రధానం చేస్తున్న దృశ్యం

చార్మినార్,నవంబరు 26 ప్రభాతవార్త : పాతబస్తీ ఘూన్సీ బజార్‌కు చెందిన తెలంగాణ బెంగాలీ సమితి అధ్యక్షులు దీపాంకర్ పాల్‌కు సేవా రత్న అవార్డు లభించింది.భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బుధవారం నగరంలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ ఇంటలెక్చల్ ఫోరమ్ తరుపున దీపాంకర్ పాల్‌కు సేవా రత్న అవార్డును తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాల కిష్టారెడ్డి, జస్టీస్ పి.ఎస్.నారాయణ, జస్టీస్ చంద్రయ్య, తెలంగాణ ఇంటలెక్చల్ ఫోరమ్ అధ్యక్షులు డాక్టర్.రాజ్ నారాయణ ముదిరాజ్‌లు ప్రధానం చేశారు.

కాంట్రాక్టర్లతో మేయర్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ కోలన్ నీలా గోపాల్ రెడ్డి

నిజాంపేట్, నవంబర్ 26, ప్రభాతవార్త

మేయర్ కోలన్ నీలా గోపాల్ రెడ్డి అధ్యక్షతన నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ సాబేర్ అలితో కలిసి మంగళవారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఆయా డివిజన్ల పరిధిలో పలు నిర్మాణ అభివృద్ధి పనులకు గానూ వారికి అందవలసిన బకాయిలు (పేమెంట్స్) కొరకు అధ్యక్షుడు హరినాథ్ ఆద్వర్యంలో మేయర్, కమీషనర్‌కి వివరించడం జరిగింది. వారు సానుకూలంగా స్పందించిన ఇతర అధికారులతో మాట్లాడి వారికి రావల్సిన బకాయిలు త్వరలోనే అందించే విధంగా కృషి చేస్తామని తెలిపారు. అదే విధంగా పెండింగ్ దశలో ఉన్న పనులపై ఆరా తీసి పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించడం జరిగింది. ఈ సమావేశంలో కార్పొరేటర్ లక్ష్మీ కుమారి, ఎస్.ఈ సత్యనారాయణ, ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పికెట్ గార్డెన్‌లో అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న కంటోన్మెంట్ దళిత సంఘాల నేతలు సంకి రవిందర్, శ్రీరాములు,రమేశ్ తదితరులు

మారేడ్‌పల్లి తహశీల్ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేసస్తున్న రెవెన్యూ సిబ్బంది,తహశీల్దార్ బీమయ్య గౌడ్ తదితరులు

అంబేద్కర్‌కు నివాళులు అర్పిస్తున్న నేతలు

అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న నాగరాజు

ఘనంగా భారత రాజ్యాంగం దినోత్సవం

పికెట్ గార్డెన్‌లో...

కంటోన్మెంట్,నవంబర్ 26 ప్రభాతవార్త: భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎస్‌బిఐ, ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ వ్యవస్తాపక సభ్యులు జేబి.రత్నం, ఆస శ్రీరాములు,కంటోన్మెంట్ వికాస్ మంచ్ ప్రధాన కార్యదర్శి సంకి రవిందర్ బాబులు తెలిపారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం పికెట్ గార్డెన్‌లో నిర్వహించిన కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై అంబేద్కర్ దేశానికి చేసిన సేవలు, అంబేద్కర్ కల్పించిన సేవలను కొనియాడారు. భారత రాజ్యాంగంతోనే ప్రతి ఒక్కరు స్వేచ్ఛగా జీవిస్తున్నారని తెలిపారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో డిసెంబర్ 1వ తేదీన మాల ఉపకులాల ఆధ్వర్యంలో నిర్వహించతల పెట్టనున్న మాలల సింహగర్జనను విజయవంతం చేసేందుకు మాల కుటుంబ సభ్యులంతా పెద్ద ఎత్తున తరలి రావాలన్నారు.ఈ కార్యక్రమంలో కంటోనెన్మెంట్ నియోజకవర్గానికి చెందిన మాల సంఘాల నేతలు కె.డి.రమేశ్, సదానంద్, నర్సింగ్‌రావ్, సతీష్ కుమార్,లెస్సీ,శ్యామ్, అరుణ్, అడ్వకేట్ ఆసరాజు, లక్ష్మణ్,నరేశ్, సిద్ధు, హన్మంత్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.

మారేడ్‌పల్లి తహశీల్ కార్యాలయంలో...

భారత రాజ్యాంగ నిర్మాత దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం మారేడ్‌పల్లి తహశీల్ కార్యాలయంలో రెవెన్యూ ససిబ్బందితో తహశీల్దార్ ప్రతిజ్ఞ చేయించారు. భారత రాజ్యాంగ చట్ట ప్రకారం తమ విధి విధానాలను బాధ్యతా యుతంగా సక్రమంగా విధులు నిర్వహిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ రాజు నాయక్, సీనియర్ అసిస్టెంట్ మోహన్, ఆర్ఐలు సర్వేశ్ సింగ్, స్వర్ణలత,కృతిక,సర్వేయర్‌శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

పికెట్‌లో చౌరస్తాలో ...

భారత రాజ్యాగ ఆమోద దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం కంటోన్మెంట్ 4వ వార్డు పికెట్ చౌరస్తాలో దళిత సంఘాల నేతలు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు నాగభూషణ్‌రెడ్డి దళిత సంఘాల నేతలు పనస సంతోష్, ఏఎల్. ఆనంద్, జె. భాస్కర్, వినోద్, సతీష్, గంగారామ్ పాల్గొన్నారు.

అన్నా నగర్‌లో...

భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలని బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీ.ఎన్.శ్రీనివాస్ తెలిపారు. 75వ రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం 2వ వార్డు అన్నా నగర్‌లో పొన్నాల బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై అంబేద్కర్ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో 2వ వార్డు బిఆర్ఎస్ అధ్యక్షులు కుమార్ ముదిరాజ్, నాయకులు దేవులపల్లి శ్రీను, ప్రకాశ్, కట్టెల మండి ధన్‌రాజ్, చంద్రకాంత్, రవిగౌడ్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

సీతాఫల్‌మండి చౌరస్తాలో...

సికింద్రాబాద్, నవంబర్ 26 ప్రభాతవార్త: రాజ్యాంగాన్ని రాసిన అంబేద్కర్ అభినందనీయుడని టీడీపీ సికింద్రాబాద్ ఇంచార్జి వల్లూరపు శ్రీనివాస్ కుమార్ అన్నారు. 75వ రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని సీతాఫల్‌మండి చౌరస్తావద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ప్రపంచదేశాలకే ఆదర్శవంతమైందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ సంఘం నేతలు విద్యాసాగర్, భాస్కర్‌గిరి, చంద్రశేఖర్, రాజేశ్వర్, బాచీ, శివప్రసాద్, విజయ్, సురేందర్, జీవి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లి బిజెపి రాష్ట్ర కార్యాలయంలో

అఫ్జల్‌గంజ్,నవంబర్ 26ప్రభాతవార్త: భారత రాజ్యాంగాన్ని రూపొందించిన దినోత్సవాన్ని పురస్కరించుకుని నాంపల్లి బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు.ఈకార్యక్రమంలో డి.గోపాల్‌జీ, ఓ ప్రకాష్‌బిస్వా,కృష్ణ,తదితరులు పాల్గొన్నారు.

నిజాంపేట్‌లో...

నిజాంపేట్, నవంబర్ 26, ప్రభాతవార్త : ప్రపంచంలో కెల్లా భారత రాజ్యాంగం ఎంతో గొప్పదని బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసి నాగరాజు అన్నారు. మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకొని బిజెపి ఎస్సీ మోర్చా అధ్యర్యంలో బాచుపల్లి,

రాజేంద్రనగర్ ఉద్యాన కళాశాల ప్రాంగణంలో అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

నిజాంపేట్‌లో ఘనంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి, జాతీయ అంబేద్కర్ అవార్డు గ్రహీత డాక్టర్ దాసి నాగరాజు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లోకెల్లా భారతదేశ రాజ్యాంగం ఎంతో గొప్పదని, దళితరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి భారత రాజ్యాంగాన్ని రచించారన్నారు. 1949 నవంబర్ 26న రాజ్యాంగం అమల్లోకి వచ్చిందని, అందువల్లనే ఈ వేడుకలు జరుపుకుంటున్నామన్నారు. ప్రతి ఒక్కరూ అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలని దాసి నాగరాజు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు మేకల నగేష్, బిజెపి బాచుపల్లి అధ్యక్షులు ప్రసాద్ రాజు, నిజాంపేట్ అధ్యక్షులు బిక్షపతి యాదవ్, బిల్డర్ సెల్ జిల్లా కన్వీనర్ పద్మ ప్రసాద్, ప్రధాన కార్యదర్శులు శివప్రసాద్, శ్రీనివాస్ గుప్తా, జిల్లా నాయకులు కౌశిక్ నాయుడు,రంపం కాశీ యువ నాయకులు ఉదయ్,ఎస్సి మోర్చా విలీది మాజీ అధ్యక్షులు కొంకి రాము, కారుణ్య వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు పాండు, జానీ, వంశీ, రాజు తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లి క్రిమినల్ కోర్టులో ఘనంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలు

నాంపల్లి క్రిమినల్ కోర్టులో జరిగిన రాజ్యాంగ దినోత్సవ సభలో మాట్లాడుతున్న మెట్రోపాలిటన్ సెషన్ జడ్జి బి.సురేష్, చిత్రంలో రాజవర్ధన్‌రెడ్డి, పి.అరుణకుమారి తదితరులు ఉన్నారు.

హైదరాబాద్, నవంబరు 26 ప్రభాతవార్త

మెట్రోపాలిటన్ క్రిమినల్ కోర్టు బార్ అసోసియేషన్, లీగల్ సర్వీసెస్ అథారిటీ (సెషన్స్)ల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం 75వ భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు నాంపల్లి క్రిమినల్ కోర్టులో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మెట్రోపాలిటన్ సెషన్ జడ్జి బి.సురేష్ మాట్లాడుతూ మన దేశం అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమని, రాజ్యాంగము ప్రజాస్వామ్యానికి వెన్నుముక లాంటిదని తెలిపారు. ప్రతి సంవత్సరం నవంబర్ 26న జాతీయ రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకుంటామని తెలిపారు. ప్రజలకు సామాజిక న్యాయం, జీవించే హక్కు, వాక్ స్వాతంత్రం లాంటి ప్రాథమిక హక్కులను భారత రాజ్యాంగం కల్పించిందని తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు జి.రాజవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ నవంబర్ 26న న్యాయవాదులందరూ సమావేశమై న్యాయాన్ని కాపాడుతామని న్యాయ ప్రతిజ్ఞ చేస్తారని తెలిపారు. రాజ్యాంగ మౌలిక లక్ష్యం సామాజిక, ఆర్థిక, రాజకీయ, న్యాయాన్ని అందరికీ అందించడం అని పేర్కొన్నారు. డిస్ట్రిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (సెషన్స్) కార్యదర్శి పి.అరుణ కుమారి మాట్లాడుతూ జాతీయ రాజ్యాంగ దినోత్సవాన్ని సంవిధాన్ దివాస్ అని కూడా అంటారని తెలిపారు. 26 జనవరి 1950లో మన రాజ్యాంగం అమలులోకి వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జ్యూడిషన్ ఆఫీసర్లు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

దళిత సంఘాల ఐక్యవేదిక కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్‌కు ఘన నివాళులు

పేట్ బషీరాబాద్, నవంబర్ 26, ప్రభాతవార్త

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని శివాలయ నగర్‌లో గల అంబేద్కర్ భవనం వద్ద దళిత సంఘాల ఐక్యవేదిక కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో రాజ్యాంగం అంశాన్ని పాఠ్యాంశంలో చేర్చుట గురించి 100 రోజుల అంబేద్కర్ విగ్రహానికి నిత్య మాల కార్యక్రమంలో 100 రోజులు పూర్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆల్ ఇండియా మైనార్టీ దళిత సేన అధ్యక్షులు సయ్యద్ జహంగీర్ హుస్సేన్, మేడ్చల్ మల్కాజ్గిరి డి.సి.సి ఉపాధ్యక్షులు ధమ్మని శ్రవణ్ కుమార్ ఇద్దరు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఈ యొక్క కార్యక్రమానికి ముగింపు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగాన్ని రాసిన తర్వాత ముసాయిదా కమిటీ ఈరోజు ఆమోదించడం జరిగిందన్నారు. ఈ రోజుతో 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంలో గర్వించదగ్గ విషయమని పేర్కొన్నారు. అదేవిధంగా రాజ్యాంగ రచయిత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అయితే, దానిని అమలుపరచడానికి బాబు జగ్జీవన్ రామ్



అంబేద్కర్‌కు నివాళులు అర్పిస్తున్న కమిటీ సభ్యులు

కృషి చేశారన్నారు. ఈ సందర్భంగా వారికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించడం ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా దళిత సేన అధ్యక్షులు ఆవిజ జేమ్స్, బుచ్చయ్య, అంజి, దళిత సంఘాల ఐక్యవేదిక చైర్మన్లు విజయభాస్కర్, ఘట్ట అశోక్, మాజీ చైర్మన్ల, ఆర్ సిద్దయ్య, కిషన్ రావు, కార్యదర్శి జి జే రత్నం, బి రంగయ్య, నాగార్జున రావు, ఈశ్వర్ బాబు రావు, చాంద్ పాషా, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను ఆలోచింపజేసిన థింక్ నాటిక

నాంపల్లి, నవంబరు 26 ప్రభాతవార్త : నేటి సమాజంలో కొంతమంది తల్లిదండ్రులు తమ పిల్లలను ఎంతగానో ప్రేమిస్తూ అడిగినదల్లా ఇచ్చి సంతోషపెట్టడం, దీంతో పిల్లలకు వారి ప్రేమ అలుసుగామారి అన్నీ కొడుకులే అని బ్రతికే తల్లిదండ్రులకు చివరకు ఎలా గాయపరుస్తున్నారో కళ్లకుకడుతూ తల్లిదండ్రులు పిల్లలను ఎంత బాధ్యతో పెంచుతున్నారో ఆలోచింపజేసిన సందేశాత్మక నాటకమే థింక్ ఇతివృత్తం. తెలుగు నాటక సమితి ఆధ్వర్యంలో సిరి మువ్వ కల్చరల్స్ సమర్పణలో సైఫాబాద్‌లోని ఆడిటర్ జనరల్ ఏజీ ఆఫీసులోని ఆరుబయలు రంగస్థలం వేదికపై మంజునాథ రచన దర్శకత్వంలో రూపొందిన థింక్ ....!? నాటిక అద్భుతంగా ప్రదర్శింపబడి ఎంతగానో ఆకట్టుకొని ఆలోచింపజేసింది. ప్రధానపాత్రల్లో గోవర్ధనరెడ్డి, సతీష్ కుమార్, వేణుగోపాలరావు, ప్రశాంత్, రామకృష్ణ, మంజునాథ, శ్రీదేవి, నాగరాజు, ఉమాశంకర్‌లు పాత్రోచితంగా తమ అద్భుత నటనతో జీవించి ఆహుతుల ప్రశంసలందుకున్నారు. చివరిగా అకౌంటెంట్ జనరల్ మాధవి సమితి కార్యవర్గం బి.వి.వరలక్ష్మి, అచ్యుతరావు, రాణి, సుధా రాణి, పెరుమాళ్లు, పద్మనాభంలతో కలిసి దర్శకుడుని ఘనంగా సత్కరించి ప్రదర్శనా పారితోషికం అందించి నటీనటులను సన్మానించి అభినందించారు.

బండ్లగూడ కార్పొరేషన్‌ను సందర్శించిన మున్సిపల్ కమిషనర్ శ్రీదేవి

బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్‌లో కార్మికులతో మాట్లాడుతున్న మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమీషనర్ అండ్ డైరెక్టర్ డాక్టర్ టి.కె.శ్రీదేవి.

నార్సింగి, నవంబర్ 26 ప్రభాతవార్త : బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్‌ను మంగళవారం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమీషనర్ అండ్ డైరెక్టర్ డాక్టర్ టి.కె.శ్రీదేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె కార్పోరేషన్ పరిధిలోని శానిటేషన్, ట్రేడ్‌లైసెన్స్, ఇంటి పన్నులు, ఎల్ఆర్ఎస్ అంశాలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం కార్పోరేషన్ పరిధిలోని సాలీడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రీసోర్స్ పార్కును పరిశీలించారు. కంపోస్ట్ పద్ధతి ద్వారా ఎవరువు తయారు చేసే ప్రక్రియను మరింత మెరుగు పర్చాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సకాలంలో పన్నులు వసూలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడి పల్గుణ్ కుమార్, బండ్లగూడ కమీషనర్ శరత్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

చేనేత రంగం అభివృద్ధి కృషి చేయాలి

తుర్కయంజాల్ నవంబరు26,ప్రభాతవార్త : చేనేత రంగ అభివృద్ధి కి అందరూ ఐక్యంగా కృషి చేయాలి అని తెలంగాణ రాష్ట్ర చేనేత ఐక్య వేదిక అధ్యక్షుడు రాపోలు వీరమోహన్ పిలుపునిచ్చారు ఐక్యవేదిక ఉపాధ్యక్షురాలుగా ఎన్నికైన స్థానిక వస్త్ర వ్యాపారి సామల స్వప్న మనోహర్ అభినందాన,సన్మాన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ రోజు రోజుకు చేనేత కళా రంగం నిరాదరణ కు గురి అవుతుంది అని ప్రభుత్వం తగిన విధంగా చేనేత రంగాన్ని ఆదుకోవాలి అని కోరారు ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక కోశాధికారి జేల్లా రఘు తుర్కయంజాల్ రాగన్నగూడ పద్మశాలి సంగం అధ్యక్షుడు గంజి సంజీవ భక్త మార్కండేయ శివాలయం అధ్యక్షుడు జేల్లా పర్యతాలు ప్రధాన కార్యదర్శులు కర్నాటి అశోక్ సామల మహేష్ తదితరులు పాల్గొన్నారు

మారుమ్రోగిన అయ్యప్ప నామస్మరణం

మహా పడిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

నార్సింగి, నవంబర్ 26 ప్రభాతవార్త : కలియుగ ప్రత్యక్ష దైవమైన హరిహర తనయుడు అయ్యప్ప నామ స్మరణంతో కోకాపేట్ గ్రామం మారుమ్రోగింది. గండిపేట్ మండల పరిధిలోని కోకాపేట్‌లో అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన "మహా పడిపూజ" కన్నుల పండువగా సాగింది. కోకాపేట్‌లో మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు అయ్యప్ప భక్తిగీతాలే వినిపించాయి. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య శాస్త్రోక్తంగా అయ్యప్పస్వామి మహా పడి పూజ వైభవంగా జరిగింది. వందలాది మంది అయ్యప్ప స్వాములు లయబద్దంగా హరిహర తనయుడిని స్తుతిస్తూ ఆలపించిన భక్తిగీతాలు ఆహుతులను, స్థానిక ప్రజలను భక్తిసాగరంలో ముంచెత్తాయి. ఈ పూజకు రాజేంద్రనగర్ నియోజకవర్గం ఏమ్మేల్యే ప్రకాశ్‌గౌడ్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు ముంగి జైపాల్‌రెడ్డి, మాజీ ఏంపీపీ తలారి మల్లేష్ ముదిరాజ్, నార్సింగి మున్సిపల్ చైర్ పర్సన్ నాగపూర్ణ, వైస్ చైర్మన్ విజయ్‌బాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ కె.వేణుగౌడ్, సీనియర్ నాయకులు క్యాతం అశోక్ యాదవ్, హరిశంకర్‌లతో పాటు గురుస్వాములు, అయ్యప్ప మాలధారులు, భక్తులు పాల్గొని మహా పడిపూజ హారతిని కళ్లకు అద్దుకున్నారు. ఈ కార్యక్రమంలో వందలాది మంది భక్తజనం పాల్గొని కరుణా హృదయుడు శబరిగిరీశుడి కరుణా కటాక్షాలకు పాత్రులయ్యారు.

ముదిరాజ్‌లంతా ఐక్యంగా ఉందాం

- రాష్ట్ర ముదిరాజ్ సంక్షేమ సంఘం అధ్యక్షులు పుట్ట యాదగిరి

హైదరాబాద్, నవంబర్ 26 ప్రభాతవార్త : ముదిరాజ్‌లమంతా ఐక్యంగా ఉంటేనే విద్యా,ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాలలో ఎదుగుతామని రాష్ట్ర ముదిరాజ్ సంక్షేమ సంఘం అధ్యక్షులు పుట్ట యాదగిరి ముదిరాజ్ పిలుపునిచ్చారు. మంగళవారం ముదిరాజ్ సంక్షేమ సంఘంలో భారాగా నూతన నియామకాలు జరిగాయి. ఈ నియామకాల వలన ముదిరాజ్ సంఘం అభివృద్ధి పథంలో నడుస్తుందన్న ఆశాభావంతో ఉత్సాహవంతులు, మేధావులకు కీలక బాధ్యతలు అప్పగించారు. ముఖ్య సలహాదారులు సి.శంకర్ ముదిరాజ్, వర్కింగ్ ప్రెసిడెంట్ నవీన్ కుమార్ ముదిరాజ్, సలహాదారులు రాంచందర్ ముదిరాజ్‌ల సమక్షంలో నూతన నియామకాలు జరిగాయి. రాష్ట్ర మహిళా అధ్యక్షురాలుగా ద్యాగల రమా ముదిరాజ్, ఉపాధ్యక్షురాలిగా వద్దపల్లి శ్రీదేవి ముదిరాజ్, కార్యదర్శులుగా బిచాల తులసీ, దివ్య, ప్రధాన కార్యదర్శిగా అంజయ్య ముదిరాజ్, ఉపాధ్యక్షులుగా వి.బాలరాజ్ ముదిరాజ్, కే.అనంతయ్య ముదిరాజ్, కార్యదర్శిగా చింతల సత్యనారాయణ ముదిరాజ్, ప్రచార కార్యదర్శిగా

ఆత్మగౌవరానికి భంగం కలిగించిన వ్యక్తిపై పరువు నష్ట దావా వేస్తాం

గోషామహల్,నవంబర్ 26ప్రభాతవార్త: ఉస్మానియా వైద్యకళాశాల ప్రహారి గోడకు అనుకుని ఉన్న స్థలం సక్రమమే కాని,అక్రమం కాదని ఆ భూమి యాజమానులు వి. కిషన్‌యాదవ్,వి.సాయిరాం యాదవులు తెలిపారు.ఈ మేరకు మంగళవారం ఓదినపత్రికలో వచ్చిన న్యూస్(వార్తకాదు) గోషామహల్ సర్కిల్ 14 పరిధిలో పుట్‌పాత్‌ల అక్రమణకథనాన్ని వారు తీవ్రంగా ఖండించారు.ఉస్మానియా వైద్యకళాశాల ప్రహారీ గోడకు అనుకుని ఉన్న 264గజాలస్థలాన్ని 2006 సంవత్సరంలో వాసు దేవనాయక్ వద్ద కొనుగొలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు వివరించారు.ఆస్థలం 1955 నుంచి ఆ భూమికి సంబంధించిన దస్తావేజులు ఉన్నట్లు వారు తెలిపారు.2006 సంవత్సరం నుంచి ఆస్థలానికి ప్రాపర్టీట్యాక్స్,కరెంట్‌బిల్లు ప్రభుత్వానికి చెల్లిస్తున్నట్లు చెప్పారు.కోఠి ప్రధాన వ్యాపార కేంద్రంకావడంతో మాస్థలంలో న్యాయబద్ధంగానే షేడ్ నిర్మాణం చేసుకుని అద్దెకు ఇవ్వడం జరిగిందన్నారు.ఓ దినప్రతికలోవచ్చిన న్యూస్ కథనంతో తమ పరువుకు భంగం కలిగించినట్లు వారు అగ్రహం వ్యక్తం చేశారు.ఈ విషయమైత్వరలో ప్రెస్ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.వాస్తవాలను తెలుసుకోకుండా అవాస్తలను ప్రచురించడంపట్ల ఆవేధన వ్యక్తం చేశారు.సదరు పత్రికపై తగిన న్యాయపరమైన చర్యలు తీసుకోవడంతోపాటు పరువు నష్ట దావావేస్తామని వారు తెలిపారు. ఈకార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

5వ వార్డు అభివృద్ధికి కృషి : తేలుకంట సతీష్ గుప్త

కంటోన్మెంట్,నవంబర్ 26 ప్రభాతవార్త: కంటోన్మెంట్ 5వ వార్డులోని వివిధ ప్రాంతాల అభివృద్ధి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు సామాజిక కార్యకర్త తేలుకుంట్ల సతీష్ గుప్త తెలిపారు. ఖాకగూడలో గత నెలల నుంచి రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయి. స్థానికులు తేలుకుంట సతీష్‌గుప్త దృష్టికి తీసుకు రావడంతో స్పందించిన ఆయన తన సొంత నిధులతో మంగళవారం మరమ్మత్తులు చేయించారు. ప్రజా ప్రతినిధులు,బోర్డు అధికారులు పట్టించుకోలేని సమస్యను తేలుకుంట సొంత నిధులతో మరమ్మత్తులు చేయించినందుకు స్థానికులు అభినందనలు తెలిపారు.

ఆర్‌టీఓ కార్యాలయాన్ని రోల్ మోడల్‌గా నిర్మించేందుకు చర్యలు : ఎమ్మెల్యే శ్రీగణేష్

తిరుమలగిరి ఆర్‌టీఓ కార్యాలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

కంటోన్మెంట్,నవంబర్ 26 ప్రభాతవార్త: సికింద్రాబాద్ తిరుమలగిరి ఆర్‌టీఓ కార్యాలయాన్ని సకల సౌకర్యాలతో రోల్ మోడల్‌గా నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. ఆర్‌టీఓ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. 3 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కార్యాలయం ఎలివేటెడ్ కారిడారు నిర్మాణం రోడ్డు విస్తరణలో 75 శాతం స్థలం నష్టపోవడం జరుగుతుందన్నారు. సిఎం రేవంత్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లతో చర్చించి తిరుమలగిరి ఆర్‌టీఓ కార్యాలయాన్ని రాష్ట్రంలో రోల్ మోడల్‌గా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇన్‌ఛార్జి ఆర్‌టీఓ స్వామి,మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు జయచందర్, నరసింహ్మస్వామి,అవినాష్, పాల్గొన్నారు.

ఆర్‌పిల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా: ఎమ్మెల్యే శ్రీగణేష్

కంటోన్మెంట్ నియోజకవర్గంలో వివిధ బస్తీలు, కాలనీల్లో రిసోర్స్ పర్సన్ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే శ్రీగణేష్ హామీ ఇచ్చారు. మంగళవారం ఆర్‌పీలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, జీత భత్యాల పెంపుదల, పనిభారం వంటి అంశాలపై ఆయన దృష్టికి తెచ్చారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెచ్చి పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తామన్నారు.

బిజెపి బలోపేతానికి పాటుపడాలి : శ్యామ్ సుందర్

నాలా బజార్‌లో బిజెపి సభ్యత్వ నమోదులో పాల్గొన్న శ్యామ్ సుందర్ గౌడ్,కార్పోరేటర్ కొంతం దీపిక తదితరులు

కంటోన్మెంట్,నవంబర్ 26 ప్రభాతవార్త: బిజెపి బలోపేతానికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని మహంకాలి జిల్లా బిజెపి అధ్యక్షుడు శ్యామ్ సుందర్ గౌడ్ తెలిపారు. మోండా డివిజన్ కార్పోరేటర్ కొంతం దీపిక ఆధ్వర్యంలో మంగళవారం నాలా బజార్‌లో నిర్వహించిన బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొంతం నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడా రంగాల్లో ప్రతిభకనబర్చాలి : తలసాని

సనత్ నగర్‌లో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తదితరులు

ఎస్.ఆర్.నగర్,నవంబర్ 26 ప్రభాతవార్త: విద్యార్థులు చదువుతో పాటు క్రీడా రంగాల్లో ప్రతిభకనబర్చాలని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం సనత్ నగర్‌లోని వెల్ఫేర్ గ్రౌండ్‌లో 3 రోజుల పాటు జరిగే స్పోర్ట్స్ మీట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుకే పరిమితం అయితే మానసిక ఒత్తిడికి గురౌతారన్నారు. కొంతం సమయం క్రీడలకు కెటాయించాలన్నారు. వీటితో రీలాక్స్ పొందడమే కాకుండా ఆరోగ్యంగా ఉంటారన్నారని తెలిపారు. ఈ పోటీల్లో వంద పాఠశాలలకు చెందిన 2 వేల మంది విద్యార్థులు పాల్గొనడం అభినందనీయమన్నారు. క్రికెట్, ఖోఖో,చెస్, వాలీబాల్, పుట్‌బాల్ వంటి క్రీడల్లో ఆసక్తి కలిగి రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కొలను బాల్ రెడ్డి, ఆర్ఎస్. ఎం.ఏ. అధ్యక్షుడు అగస్టిన్, కార్యదర్శి సుదర్శన్ రెడ్డి, ఉమా మహేశ్వర్ రావ్, ప్రసాద్, ప్రశాంత్,సీతా,వివి.రావ్ పాల్గొన్నారు.

చికిత్సపొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి

సికింద్రాబాద్, నవంబర్ 26 ప్రభాతవార్తః గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. సుమారు 40 సంవత్సరాల గుర్తు తెలియని వ్యక్తి ఈనెల 16న గాంధీ ఆస్పత్రి అత్యవసర విభాగం వద్ద అసస్మారక స్థితిలో పడి ఉండగా సిబ్బంది ఆస్పత్రిలో చేర్చారు. కాగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు నీలిరంగు టీషర్ట్, నీలిరంగు అండర్‌వేర్ మాత్రమే ధరించాడు. సంబంధికులు ఎవరైనా ఉంటే చిలకలగూడ పోలీసులను సంప్రదించాలని కోరారు.

పేద ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే పద్మారావ్ గౌడ్

కంటోన్మెంట్,నవంబర్ 26 ప్రభాతవార్త: పేద ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమం కోసం అర్హులైనలబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ టీ.పద్మారావు గౌడ్ తెలిపారు. మంగళవారం సీతాఫల్ మండిలోని మధురానగర్, ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించని కళా ్యణ లక్ష్మి షాదీముబారక్ చెక్కులను కార్పోరేటర్లు రెవెన్యూ అధికారులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ఆడపిల్లల వివాహానికి హానికి భారం పడకుండా గత ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. వివిధ హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను నిలబెట్టుకొని అమలు చేయాలన్నారు. కళా ్యణ లక్ష్మి లక్ష 166తో పాటు తులం బంగారం అందిస్తామని ప్రకటించిన హామీ ఏమైందని ప్రశ్నించారు. అధికారులు ప్రొటోకాల్ నిబంధనలను ఉల్లంఘించి ప్రవర్తిస్తున్నారని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రవర్తనను మార్చుకోకపోతే అధికారుల తీరుపట్ల స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఇక నుంచి చెక్కుల పంపిణీ కార్యక్రమాలు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలోనే నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మారేడ్‌పల్లి తహశీల్దార్ బీమయ్య గౌడ్, ముషీరాబాద్ తహశీల్దార్ ప్రతాప్ సింగ్, కార్పోరేటర్లు సామల హేమ, లింగాని ప్రసన్న శ్రీనివాస్, రాసూరి సునీత, కంది శైలజా, బిఆర్ఎస్ నాయకులు ఆలకుంట్ల హరి, లింగాని శ్రీనివాస్, కరాటే రాజు,కంది నారాయణ, కాంగ్రెస్ నాయకులు జలందర్ రెడ్డి, గంట రాజు సాగర్, అనీల్ తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణ లక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే పద్మారావు గౌడ్

టౌన్‌ప్లానింగ్ అవినీతిపై రాష్ట్ర ప్రణాళిక సంఘానికి ఫిర్యాదు

జంటసర్కిళ్లలో అక్రమనిర్మాణాలపై ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న బద్దం కొండలరెడ్డి

శేరిలింగంపల్లి,నవంబర్ 26 ప్రభాతవార్త

శేరిలింగంపల్లి,చందానగర్ జంట సర్కిళ్ల పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను ప్రొత్సహిస్తున్న జంట సర్కిళ్ల టౌన్‌ప్లానింగ్ అవినీతిపై సమగ్రంగా విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని మదర్ సేవా సమితి ఛైర్మన్ బద్దం కొండల్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ ఛైర్మన్ డాక్టర్ జి.చిన్నరెడ్డికి వినతిపత్రాన్ని అందించి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బద్దం కొండల్‌రెడ్డి మాట్లాడుతూ. శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని పాపిరెడ్డి నగర్ కాలనీ, రాజీవ్ గృహకల్ప, సుదర్శన్ నగర్,టెలిఫోన్‌కాలనీ, కాంతివనం, శిల్ప కాలనీ, రాజరాజేశ్వర కాలనీ, రాఘవేంద్రకాలనీ, కొండాపూర్, మాదాపూర్, నందిహిల్స్, గచ్చిబౌలి,గోపన్‌పల్లి, నల్లగండ్ల తదితర ప్రాంతాలలో బహుళ అంతస్తుల అక్రమ భన నిర్మాణాలు జరగుతున్నాయన్నారు. వంద,రెండు వందల గజాలలో ఐదు,ఆరు ఫ్లోర్లు అక్రమ నిర్మాణాలను చేసి సెల్లార్లలో పార్కింగ్ స్థలాలలో వ్యాపార సముదాయాలను ఏర్పాటు చేసి అద్దెలకు ఇచ్చి లబ్ధిపొందుతున్నారన్నారు. వాహనాలకు పార్కింగ్ సౌకర్యం లేకుండా భవన సముదాయం ముందు,వెనుక రోడ్లపైకి జరిగి పలు ప్రాంతాలలో అక్రమ నిర్మానాలు జరుగుతున్నాయన్నారు. వాహనాలను రోడ్లపైనే పార్కింగ్ చేయటం వల్ల రహదారిపై రాకపోకలు సాగించే ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు బస్సులు, స్కూళ్ల బస్సులు, అంబులెన్స్‌లకు దారిలేక రహదారులు కుచించుకుపోయి ప్రతి నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అక్రమ నిర్మాణాలను సర్కిళ్ల చైన్‌మెన్‌లు, టౌన్‌ప్లానింగ్ అధికారులు అందినకాడికి దండుకుని అక్రమార్కులకు కొమ్ముకాస్తున్నారని ఆయన ఆరోపించారు. అక్రమ నిర్మాణాలపై గ్రీన్ ట్రిబ్యునల్ కోర్టు, హైకోర్టు, రాష్ట్ర గవర్నర్ కూడా అక్రమ నిర్మాణాలను కట్టడి చేయాలని పలుమార్లు ఆదేశించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. నివాసం ఉండేందుకు అనుమతులు తీసుకుని బడా బిల్డర్లు బహుళ అంతస్తుల భవనాలను నిర్మిస్తూ నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని, కొందరు బిల్డర్లు అక్రమ నిర్మాణాలు చేసి కోట్లకు పడగలెత్తుతున్నారని, సరైన సదుపాయాలు లేకపోవడంతో కొనుగోలు చేసిన నివాసితులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. దీంతో వాహనాలకు పార్కింగ్ సదుపాయం, వర్షాలు పడినపుడు నీరు నిలిచి ప్రాణనష్టం,ఆస్థినష్టం, వాహనాలకు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఈ విషయమై ప్రభుత్వ యంత్రాంగం సమగ్రంగా విచారణ జరిపి అవినీతి అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. గతంలో నానక్‌రాం గూడలో జీప్లస్ 2 అనుమతులు తీసుకుని ఆరు అంతస్తుల అక్రమ నిర్మాణం చేపట్టారని, ఆ భవనం కూలిపోవటంతో దాదాపు 10మంది కార్మికులు సజీవ సమాధి అయ్యారని, గచ్చిబౌలిలోని సిద్దిక్ నగర్‌లో 50 గజాల స్థలంలో 5 అంతస్తుల అక్రమ నిర్మాణాన్ని ఇటీవలే కూల్చివేశారని, వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని అక్రమ నిర్మాణాలపై కఠినంగా వ్యవహరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయమై ప్రజావాణిలో జిల్లా కల్లెక్టర్‌కు, వెస్ట్‌జోన్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డికి, శేరిలింగంపల్లి,చందానగర్ సర్కిళ్ల డిప్యూటి కమిషనర్లకు పిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

రాజ్యాంగం ప్రజాస్వామ్యానికి పునాది

- రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్.నంద

రవీంద్రభారతి, నవంబరు 26 ప్రభాతవార్త : భారతరత్న డా. బాబాసాహెబ్ అంబేద్కర్ అందించి భారత రాజ్యాంగం 26 నవంబరు 1949 నుండి అమలులోకి వచ్చిన సందర్భాన్ని దేశవ్యాప్తంగా జాతీయ రాజ్యాంగ దినోత్సవంగా జరుపుకుంటున్నామని, రాజ్యాంగం ప్రజాస్వామ్యానికి పునాది వంటిదని, రాజ్యాంగ విలువలను కాపాడుకోవాల్సిన అవసరం బాధ్యత అందరిపైనా ఉందని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నంద అన్నారు. అలాగే ఇదేరోజును 2015 నుండి జాతీయ న్యాయ దినోత్సవంగా కూడా జరుపుకొంటున్నామని తెలిపారు. రాజ్యాగమనేది దేశాల ప్రజాస్వామ్య సంప్రదాయ బలం, శక్తిని ప్రతిబింబించే అద్దం వంటిదన్నారు. ఇది ప్రజల హక్కులు, స్వేచ్ఛను కాపాడుతుందని చెప్పారు. రాజ్యాంగం ప్రకారం చట్టాలు ప్రజలందరికీ స్వేచ్ఛ, సమానత్వం, సమన్యాయం అందించాలని చెప్పబడ్డాయని స్పష్టం చేశారు. రాజ్యాంగం కేవలం ఒక పత్రం కాదని, దీని ప్రకారం న్యాయశాఖ, న్యాయవాదులు, న్యాయమూర్తులు చట్టబద్ధంగా అందరికీ అందేలా చూడాల్సిన అవసరముందని జస్టిస్ నంద పేర్కొన్నారు. మెగాసిటీ నవకళావేదిక, మథర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశంలో సరస్వతీ ఉపాసకుడు దైవజ్ఞశర్మ సభాధ్యక్షతన నిర్వహించిన న్యాయదినోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన జస్టిస్ ఎస్.నంద విశిష్ట అతిథులు డా. టి. ఆనందమూర్తి, డి.ఎల్.పాండు, ఎస్.సూర్యప్రకాష్, ఎర్రా లచ్చన్న, కె.ఈశ్వర్‌చారి, సంస్థ అధ్యక్షుడు ఎ.మల్లికార్జునరావు, కార్య నిర్వహణ కార్యదర్శులు రాఘవ, సాయినాథ్, సాయికుమార్ తదితరులతో కలిసి సుమారు 25మంది న్యాయవాదులను ఘనంగా సత్కరించి న్యాయశ్రీ అవార్డ్స్-2024ను ప్రదానంచేసి ఎంతగానో అభినందించారు. అతిథులు ప్రసంగించిన అనంతరం పురస్కార స్వీకర్తలు తమ స్పందన తెలిపారు.

న్యాయశ్రీ అవార్డు గ్రహీతలతో జస్టిస్ నంద, దైవజ్ఞశర్మ, మల్లికార్జునరావు, రాఘవ, పాండు, లచ్చన్న తదితర అతిథులు

నవభారత నిర్మాణానికి రాజ్యాంగమే మూల కారణం

-ప్రొఫెసర్ కోదండరామ్

సభలో ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ ఎం.కోదండరామ్

సైఫాబాద్, నవంబరు 26 ప్రభాతవార్త:

నవభారత నిర్మాణానికి భారత రాజ్యాంగమే మూల కారణమని ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ చెప్పారు. సార్వభౌమ, ప్రజాస్వామిక , సమానతవ్వ, లౌకిక దేశంగా భారతదేశం ఏర్పాటు కావడానికి భారత రాజ్యాంగంతోనే సాధ్యమైందని ఆయన వివరించారు. బిసి సెల్ ఆధ్వర్యంలో మంగళవారం నిజాం కళాశాలలో జరిగిన 75వ రాజ్యాంగ దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. భిన్నత్వంతో కూడిన భారతదేశంలో విభిన్న వర్గాల ప్రజల సంక్షేమంతోపాటు సామాజిక న్యాయం, అభివృద్ధి జరగడానికి రాజ్యాంగమే కారణమని ఆయన స్పష్టం చేశారు. ప్రజలకు హక్కులను కల్పించడంతోపాటు బాధ్యతలను కూడా సూచించిన భారత రాజ్యాంగం ప్రపంచ దేశాలలోనే ఒక గొప్ప రాజ్యాంగమని ఆయన వివరించారు. ఈ సభకు అధ్యక్షత వహించిన నిజాం కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎ.వి.రాజశేఖర్ మాట్లాడుతూ అన్ని కోర్సుల విద్యార్థులు భారత రాజ్యాంగం గురించి తెలుసుకోవాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రొఫెసర్ కోదండరామ్ నిర్వహించిన పాత్రను ఆయన కొనియాడారు. ఈ సభలో కళాశాల అకాడమిక్ కో-ఆర్డినేటర్ డా.ఎస్.రేణుక, బిసి సెల్ కో-ఆర్డినేటర్ డా.సి.హెచ్. వెంకటేశ్వర్లు, డా.మెల్లిసా, డా.కవితాషిండే తదితరులు పాల్గొన్నారు.

మితిమీరిన స్వేచ్ఛ తెగిన గాలిపటంలాంటిది : డా. కె.వి.రమణాచారి

రవీంద్రభారతి, నవంబరు 26 ప్రభాతవార్త : దారమనే హద్దులో గాలిపటం ఆకాశంలో స్వేచ్ఛగా ఎగురుతుందని, ఆ దారమనే హద్దు, మితిమీరిన స్వేచ్ఛ, పరిమితులులేని జీవితం తెగిన గాలిపటాల్లాంటివన్న తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు డా. కె.వి. రమణాచారి తెగిన గాలిపటం ఆకాశంలో గాలివాటానికి ఎటుపోతుందో దానికే తెలియక తల్లకిందులైపోయి గింగిరాలు తిరుగుతూ ఏ చెట్టుకొమ్మకో. కరెంటు తీగకో చిక్కుకుని చిరిగిపోతుందన్నారు. అలాగే మనిషికి స్వేచ్ఛలో నిర్ణయాత్మక నియంత్రణ, సంరక్షణతో కూడిన స్వచ్ఛత ఉండకపోతే మనిషి బ్రతుకు మలినమై మురికికంపు కొడుతుందని, ఎలాగైతే గాలిపటానికి దారమే ఆధారం.... స్వేచ్ఛకి హద్దే ముద్దని రమణాచారి అన్నారు. 27 మంగళవారం రాత్రి 6.30గంటల నుండి రవీంద్రభారతి ప్రధాన మందిరంలో రసరంజని హైదరాబాద్ ఆధ్వర్యంలో ఇదే కథాంశంతో పి.ఎస్.నారాయణ మూలకథ, పి.శివరాం నాటకీకరణ, బి.ఎం.రెడ్డి దర్శకత్వం, విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ హైదరాబాద్ వారి సమర్పణలో సందేశాత్మక స్వేచ్ఛ నాటకం ప్రదర్శింపబడుతుందని, అధికసంఖ్యలో నాటకప్రియులు, ఔత్సాహిక ప్రేక్షకులు విచ్చేసి నాటకాన్ని ఆసాంతం తిలకించి నాటకరంగాన్ని, కళాకారులను ప్రోత్సహించాలని డా. కె.వి.రమణాచారి కోరారు.

సమాచార హక్కు చట్టాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి

శ్రావణ్‌కుమార్‌కు నియామపత్రాన్ని అందించిన చంటి ముదిరాజ్

సైఫాబాద్, నవంబరు 26 ప్రభాతవార్త:

సమాచార హక్కు చట్టాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సమాచార హక్కు చట్టం సాధన కమిటి రంగారెడ్డి జిల్లా నూతన ప్రధాన కార్యదర్శి వంటేపాక శ్రావణ్‌కుమార్ చెప్పారు. ఈ మేరకు మంగళవారం కమిటీ కార్యాలయంలో ఆయనను ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ కమిటీ జాతీయ అధ్యక్షుడు చంటిముదిరాజ్ నియామకపత్రాన్ని అందించిన సందర్భంగా మాట్లాడారు. సమాచార హక్కు చట్టం పూర్తి స్థాయిలో అమలు జరగడం లేదని, అధికారుల్లో జవాబుదారితనం కొరవడిందని శ్రావణ్‌కుమార్ ఆరోపించారు.నిర్ణీత సమయంలోపు సమాచారం లభించకపోతే అప్పిలేట్ అధికారికి అప్పిల్ చేసుకోవచ్చునని, అప్పటికి స్పందన రాకపోతే రాష్ట్ర సమాచార హక్కు చట్టం చీఫ్ కమిషనర్‌కు అప్పిల్ చేసుకోవచ్చునని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు సూర స్రవంతి, ప్రధాన కార్యదర్శి మల్లెం వెంకటేశం, నాయకులు గుండెల రాయుడు, గంగా రజిని, ప్రియరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణకు స్వాతంత్ర్యం తెచ్చిన జాతిపిత కెసిఆర్

దుండిగల్, నవంబర్ 26 ప్రభాతవార్త: భారస కార్యనిర్వాహక అధ్యక్షులు కెటిఆర్ పిలుపుమేరకు ఈనెల 29న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న దీక్షాదివాస్ కార్యక్రమంపై మంగళవారం గండిమైసమ్మలోని భారస జిల్లా కార్యాలయంలో అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అధ్యక్షతన నిర్వహించిన సన్నాహాక సమావేశానికి ముఖ్య అతిథిగా శాసనమండలి ఛైర్మన్ స్వామిగౌడ్ అతిథులుగా మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యేలు వివేకానంద్, మాధవరం క్రిష్ణారావు, మల్లారెడ్డి, బండారి లక్ష్మారెడ్డిలు పాల్గొన్నారు. ఈసందర్భంగా స్వామిగౌడ్ మాట్లాడుతూ గత పాలకుల పాలనలో అడుగడుగునా వివక్షకు గురైన తెలంగాణ ప్రాంత అభివృద్ధి కేవలం స్వరాష్ట్ర సాధనతోనే నమ్మి తెలంగాణ వచ్చుదో.. కెసిఆర్ చచ్చుదో అనే ఉద్యమ పంథాలో తెలంగాణలో అన్ని వర్గాలను ఏకం చేసిన దార్శనికుడు కెసిఆర్ అన్నారు. మలిదశ ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఎగిసిపడేలా అందరిని ఏకం చేస్తూ కెసిఆర్ చేపట్టిన అమరణ నిరహారదీక్ష ప్రారంభించిన రోజు 29నవంబర్2009ను గుర్తు చేసుకుంటూ ప్రతి ఏడాది దీక్షాదివాస్ పేరుతో నాటి ఉద్యమ తీరును నెమరు వేసుకోవడం జరుగుతుంది. రాష్ట్రం ఆవిర్భవించిన అనతికాలంలోనే తెలంగాణను దేశంలోనే అగ్రగామికి అభివృద్ధి పరిచిన ఘనత తెలంగాణ అభివృద్ధి ప్రధాత కెసిఆర్ అన్నారు. తెలంగాణకు స్వాతంత్రం తీసుకువచ్చిన తెలంగాణ జాతిపిత కెసిఆర్ అని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కెపి. వివేకానంద్, ఎమ్మెల్సీ రాజులు మాట్లాడుతూ కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం పదేళ్ళ కెసిఆర్ నాయకత్వంలో దేశానికే ఆదర్శంగా రూపుదిద్దుకుందని తెలిపారు. అటువంటి తెలంగాణను అధికారంలోకి కాంగ్రెస్ ప్రభుత్వం 11నెలల వ్యవధిలో దేశంలోనే అట్టడుగూ స్థాయిలో నిలిపి పేద మధ్యతరగతి ప్రజలతో పాటు అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి మరిచి రాష్ట్రాన్ని అదోగతి పాలు చేస్తున్నారు. కాంగ్రెస్, బిజెపి ప్రభుత్వాలపై సమరశంఖం పూరించేందుకు దీక్షాదివాస్ కార్యక్రమంతో మరోమారు అంకురార్పణ జరగాలని పిలుపునిచ్చారు. దీక్షాదివాస్ కార్యక్రమానికి భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, క్రీయాశీల నాయకులు, మహిళా విభాగం, యువజన విభాగం నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మండలి మాజీ ఛైర్మన్ స్వామిగౌడ్

నటుడు సోనూసూద్‌కు సంకల్ప్ కిరణ్ పురస్కారం

28న లలితకళాతోరణంలో జరిగే కార్యక్రమంలో అందజేత

హైదరాబాద్,నవంబర్ 26,ప్రభాతవార్త: ప్రతియేటా సుచిరిండియా ఫౌండేషన్ అందించే సంకల్ప్ కిరణ్ పురస్కారం ఈ సారి ప్రముఖ నటుడు, సామాజిక వేత్త సోనూసూద్‌ను వరించనుంది. సుచిరిండియా ఫౌండేషన్ సంకల్ప్ దివాస్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 28న లలితా కళాతోరణంలో జరగబోయే కార్యక్రమంలో నటుడు సోనూసూదన్‌కు సంకల్ప్ కిరణ్ పురస్కారం అందజేయబోతున్నట్లు వ్యాపారవేత్త, సుచిరిండియా ఫౌండేషన్ అధినేత లయన్ కిరణ్ తెలిపారు. మంగళవారం ఆయన జూబ్లీహిల్స్‌లోని ఆయన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. తాము రెండు దశాబ్దాలుగా సామాజిక వేత్తలను, గొప్ప మానవతావాదులను గుర్తించి వారికి పురస్కారాలు అందిస్తున్నామని ఈ సారి సోనూసూద్‌కు సంకల్ప్ కిరణ్ పురస్కారం అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారత్-బల్గేరియా రాయబార కార్యాలయ అంబాసిడర్ నికోలయ్ యాంకోవ్ పాల్గొంటున్నారని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

బేగంబజార్,నవంబర్ 26ప్రభాతవార్త: హిందీనగర్ 11 కెవి విద్యుత్ ఫీడర్ల మరమ్మత్తుల కారణంగా బుధవారం ఉదయం10గంటల 30 నిమిషాల నుండి మధ్యాహ్నం 2వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు బేగంబజార్ సిబిడి ఎ.డి.ఇ వెంకటేశ్వర్లు తెలిపారు.చాన్నవాడి,రజాక్ పురా, భరత్‌మెటల్ వర్క్స్ తదితర ప్రాంతాలు,శివకుమార్‌లాల్ స్టేడియం 11 కెవి విద్యుత్ ఫీడర్ల మరమ్మత్తుల కారణంగా ఉదయం 10గంటల30 నిమిషాల వరకు ఉస్మానియా ఆసుపత్రివరకు విద్యుత్ సరఫరాను తదితర ప్రాంతాలల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు.కాగా 11కెవి బేగంబజార్ ఫీడర్ మరమ్మత్తుల కారణంగా మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు బేగంబజార్‌ఛత్రి,సెవన్ ఎవెన్ హోటల్,కంటి ఆసు

నాచారంలో ఘనంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలు

అంబేద్కర్ విగ్రహం వద్ద రాజ్యాంగాన్ని చూపిస్తున్న నాయకులు మల్లెల నర్సింగ్‌రావు తదితరులు

నాచారం, నవంబర్ 26 ప్రభాతవార్త: బిజేపి నాచారం డివిజన్ అధ్యక్షులు ప్రకాష్ ఆధ్వర్యంలో నాచారంలో ఘనంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా ఉపాధ్యక్షులు మల్లెల నర్సింగ్‌రావు రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు అర్పించి రాజ్యాంగం పుస్తకాన్ని చూపించారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగంతో ఎంతో మంది పేదలు, బడుగుల్లో వెలుగులు నిండాయన్నారు. ఈ కార్యక్రమంలో బిజేపీ నాయకులు తాడూరి శ్రీనివాస్, జిల్లా అధికార ప్రతినిధి గోపాల్ గౌడ్, కిసాన్ మోర్చ ఉపాధ్యక్షులు రాగిరి మోహన్‌రెడ్డి, నాయకులు నవీన్ గౌడ్, కురపాక అంజి, శ్రీధర్ రెడ్డి, పాదం వెంకటేష్, దయాగౌడ్, ప్రతాప్ రెడ్డి, కృష్ణ, శేఖర్, ముంజుల వాణి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

యువత గంజాయి డ్రగ్స్‌కు బానిసలు కావద్దు : ఎసిపి చక్రపాణి

ప్రతిజ్ఞ చేయిస్తున్న మల్కాజిగిరి ఏసీపి చక్రపాణి

నాచారం, నవంబర్ 26 ప్రభాతవార్త: యువత గంజాయి, డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలు, చెడు వ్యసనాలకు బానిసలు కావద్దని మల్కాజిగిరి ఏసీపి చక్రపాణి సూచించారు. నాచారం జాన్స్‌న్ గ్రామర్ స్కూల్లో మంగళవారం విద్యార్థులకు నాచారం పోలీసులు సైబర్ క్రైం,నార్కోటిక్ డిపార్ట్‌మెంట్ల సంయుక్త ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, గంజాయి ఇతర మత్తు పదార్థాల పట్ల వచ్చే అనార్థలపై అవగాహణ కార్యక్రమానికి నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపి మాట్లాడుతూ విద్యార్థి దిశలోనే చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా ఏకాగ్రతతో విద్యను అభ్యసించాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. షీటీమ్స్, ఫోక్స్ చట్టాలపై అవగాహణ కల్పించారు. ఈ కార్యక్రమంలో నాచారం ఇన్స్‌పెక్టర్ రుద్విర్‌కుమార్, ఎస్సైలు వెంకటయ్య,మైబెల్లితో పాటు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

కమ్యూనిటి హాల్ నిర్మాణ పనులు ప్రారంభం

కమ్యూనిటి హాల్‌కు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి

సైదాబాద్, నవంబరు 26 ప్రభాతవార్త: సైదాబాద్ డివిజన్ ఎల్‌సిహెచ్ చిన్న కాలనీలో కమ్యూనిటి హాల్ నిర్మాణ పనులకు కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లోని అన్ని కాలనీలలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని అన్నారు. కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు తమ కాలనీలలోని సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చి వాటి సత్వర పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఇ వెంకన్న, కాలనీవాసులు శశాంక్ యాదవ్, అశ్విన్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

బిసిల అభివృద్ధికి కృషి చేయాలి..

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డికి వినతి పత్రం అందిస్తున్న బీసి సంఘం సభ్యులు

నేరెడ్‌మెట్,నవంబర్26,ప్రభాతవార్త: బీ.సిల అభివృద్ధికి కృషి చేయాలని కోరుతూ మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలోని నేరెడ్‌మెట్ పాపన్న గౌడ సేన సభ్యులు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రకారం జనాభ ప్రతిపాదికన బి.సి కుల వర్గీకరణ చేయాలన్నారు. బి.సిలకు రాజకీయ రిజర్వేషన్లను కల్పించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం బి.సిలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను కేటాయించాలన్నారు. కేంద్రప్రభుత్వం ఏర్పాటు చేసే జనాభా లెక్కల్లో బి.సి గణన ఏర్పాటు చేయాలన్నారు. బి.సి లకు ప్రతి సంవత్సరం ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో నేరెడ్‌మెట్ పాపన్న గౌడ సేన సభ్యులు పాల్గొన్నారు.

టివికాలనీలో పవర్‌బోర్ పనులు : రజితరెడ్డి

టివికాలనీలో పవర్‌బోర్ పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ఎం.రజితరెడ్డి తదితరులు

ఉప్పల్, నవంబరు 26 ప్రభాతవార్త :

ఉప్పల్ డివిజన్ పరిధిలోని టివికాలనీ పార్కులో పవర్ బోరు పనులను మంగళవారం స్థానిక కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ కాలనీ పార్కులో పవర్ బోరు లేక ఇబ్బంది పడుతున్నారని, ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయించి పనులు చేపట్టినట్లు తెలిపారు. పార్కును సర్వంగా సుందరంగా తీర్చిదిద్దుతామని ఆమె తెలిపారు. ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రంలో కాలనీ సంఘం నేతలు సత్తిరడెడ్డి, సీతారామ్, భవానీ, రఘువీర్,సూర్యనారాయణ, బ్రహ్మం, లతా నియా, ప్రసాద్, దాస్, అనిల్, వంశీ, కనకచారి, శివరాజ్, మధు, సంతోష్, ప్రభాకర్, రాధారెడ్డి, సరళ, ఇందుమతి, కవితి, సందీప్, భాస్కర్, సాయిలు, రాంచందర్, గణేష్‌చారి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి కృషి : చైర్మన్ ముత్తినేని వీరయ్య

మలక్ పేట్ ,నవంబర్ 26, ప్రభాతవార్త:

దివ్యాంగులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సంక్షేమానికి కృషి చేస్తున్నామని వికలాంగుల సంక్షేమ శాఖ చైర్మన్ మూత్తినేని వీరయ్య పేర్కొన్నారు. మలక్ పేట నల్గొండ చౌరస్తారని వికలాంగుల సంక్షేమ శాఖ కార్యాలయం ఆవరణలో సంక్షేమ శాఖ చైర్మన్ ముత్తినేని వీరయ్య ఆధ్వర్యంలో వికలాంగుల సంఘాలతో ఆత్మీయ సమ్మేళనం అలయ్ బలయ్ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని నియోజకవర్గం ,జిల్లా, రాష్ట్ర స్థాయి నుంచి పలువురు వికలాగ సంఘాల నాయకులు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి వికలాంగులందరూ మద్దతు ప్రకటించారని తెలిపారు. వికలాంగుల బ్యాక్లాగ్ పోస్టులు భర్తీ ,వికలాంగుల పెన్షన్లు రూ.6 వేలు, ఉచిత బస్సు ప్రయాణం తదితర అంశాలు త్వరలోనే అమలు అవుతాయని తెలిపారు. వికలాంగుల అభ్యున్నతి కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. వికలాంగుల సోదరి రజనీకి ఉద్యోగం ఇచ్చి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మా ఆత్మబంధువు అయ్యాడని తెలిపారు .ఈ అంశాన్ని మందకృష్ణ మాదిగ కించపరచడం జరిగిందని ,ఇదేమి మీ నైతికత అని ఆయనను ప్రశ్నించారు. వెంటనే మంద కృష్ణ మాదిగ వికలాంగులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వికలాంగులపై చిత్తశుద్ధి ఉంటే వికలాంగుల సమస్యలపై చర్చించడానికి మందకృష్ణ మాదిగ చర్చకు రావాలని సవాలు విసిరారు. వికలాంగులకు అన్యాయం జరిగినప్పుడు, ఆయన రాలేదని



సమావేశంలో ప్రసంగిస్తున్న చైర్మన్ మూతినేని వీర

పది సంవత్సరాల నుంచి ఆయన కనిపించలేదని, పంచాయతీ ఎన్నికలు వస్తున్నాడంటతో ఆయన అందుకే వచ్చారన్నారు. బిజెపి పార్టీకి ఆయన అమ్ముడుపోయారని ఆరోపించారు. వికలాంగులను కొత్త ప్రభుత్వానికి వ్యతిరేకంగా మార్చడానికి ఆయన ప్రయత్నిస్తున్నారని , వికలాంగుడు కాకపోవడంతోనే ఆయనకు వికలాంగుల సమస్యలు, బాధలు తెలియడం లేదని పేర్కొన్నారు. సుమారు 200 ల వికలాంగ సంఘాలు ఇక్కడికి వచ్చాయని తెలిపారు. వికలాంగులను ఎవరికో ఒకరికి తాకట్టు పెట్టి మీ రాజకీయ జీవితాన్ని గడుపుకుంటున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన అన్ని పథకాలతో వికలాంగులు లబ్ధి పొందుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు వికలాంగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బిసిల పక్షాన మాట్లాడడం గర్వంగా ఉంది : ఎమ్మెల్యే

మల్కాజిగిరి నవంబరు26,ప్రభాతవార్త

మల్కాజిగిరి నియోజకవర్గ బిసి కులాల నాయకులతో క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ... బి.సిల పక్షాన మాట్లాడడం గర్వంగా ఉందని ఎమ్మెల్యే అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బి.సి కులగణన విధి విధానాలను 2001వ సంవత్సరం జరిపిన జనగణన మరియు సుప్రీం కోర్టు మార్గదర్శకాలను ఆధారంగా బి.సి ల రిజర్వేషన్ యాభై శాతానికి మించరాదని గెజిట్లో పొందుపరచిన అంశాన్ని సమావేశం దృష్టికి తెచ్చారు.. ప్రభుత్వానికి బి.సి. ల సంక్షేమం పై చిత్తశుద్ధి ఉంటే డెబ్బై శాతం ఉన్న బీసీలకు యాభై శాతం రిజర్వేషన్ పరిమితం ఎందుకు చేస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దీని పై పునరసమీక్షించాలని అన్నారు. తాను కూడా ఎంతోమంది మేధావులతో చర్చలు జరిపి పలు అంశాల పై సంపూర్ణ అవగాహనతో ఈ సమావేశం ఏర్పాటు చేశానని.బి.సి.కులగణన సర్వేను ప్లానింగ్ కమిషన్ ద్వారా నిర్వహించడంతో రాజకీయ పరమైన సమస్యలు తలెత్తుతాయని, ప్రత్యేక విభాగంతో కులగనన చేయించాలని,లేకపోతే చాలా వరకు రాజకీయ ప్రాతినిధ్యం లేని కొన్ని బి.సి కులాలకు అన్యాయం జరుగుతుందని, ఇప్పటికే చాలా బి.సి కులాలను గుర్తించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం ప్రదర్శిస్తుందని, కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో

ద్వారా కూడా కులగణన నిర్వహించాలని ఎమ్మెల్యే అన్నారు. కేంద్ర ప్రభుత్వంలో కూడా మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, అన్ని బి.సి.కులాలకు సమ ప్రాధాన్యత ఇవ్వాలని. బి.సి. ల చైతన్యమే లక్ష్యంగా కులాలకతీతంగా పోరాటం చేస్తానని, ఈ విషయం పై బి.సి గొంతుకను శాసనసభ ద్వారా ప్రభుత్వానికి వినిపించడంతో పాటు కేంద్ర ప్రభుత్వానికి కూడా లేఖ రాస్తానని అన్నారు. అంతే కాకుండా మల్కాజిగిరి బి.సి.కులాల ఐక్యవేదిక అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి పై పాట పాడి తన అభిమానం చాటుకున్నాడు.ఈ కార్యక్రమంలో కుల సంఘాల రాష్ట్ర స్థాయి, కేంద్ర స్థాయి నాయకులు, కార్పొరేటర్లు మా జీ కార్పొరేటర్, అన్ని రాజకీయ పార్టీల బి.సి నాయకులు పాల్గొన్నారు.

అల్మాస్‌గూడ కాలనీల సమస్యల పరిష్కారానికి శాయశక్తులా కృషి : బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి

సరూర్‌నగర్, నవంబర్ 26 ప్రభాతవార్త:

బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడకు సంబంధించిన డివిజన్లలో ప్రజా సమస్యల పరిష్కారానికి తన శాయశక్తులా కృషి చేస్తానని మహేశ్వరం నియోజకర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం ఉదయం ఆయన 4వ డివిజన్ అల్మాస్‌గూడ శేషాద్రినగర్ కాలనీలో స్థానిక సంక్షేమ సంఘం నాయకులు, యువకులతో కలిసి మార్నింగ్ వాక్ చేసి ప్రజా సమస్యలు పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులను ఆయన సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇక్కడి రోడ్డు సమస్యలను మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి దృష్టికి తెచ్చి నిధులు మంజూరు చేయించి పరిష్కరి

మార్నింగ్ వాక్ చేస్తూ రోడ్ల సమస్యలను పరిశీలిస్తున్న బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి

స్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో మోహన్, నర్సింగ్‌రావు, నవీన్, శ్రీను, రాకేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

భారతదేశ రాజ్యాంగం ఎంతో గొప్పది

: కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీ

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీ తదితరులు

మలక్ పేట ,నవంబర్ 26, ప్రభాతవార్త :

మన భారత దేశ రాజ్యాంగం ఎంతో గొప్పదని మూసారంబాగ్ డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని మూసారంబాగ్ కృష్ణ తులసి నగర్ కమ్యూనిటీ హాల్ లో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి ఆమె పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు .ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ ప్రజలందరి కి న్యాయం ,స్వేచ్ఛ, సమానత్వం, సాంఘిక ,ఆర్థిక, రాజకీయ, న్యాయాన్ని అందించేందుకు ఎందరో మేధా వుల సారధ్యంలో రాజ్యాంగం రూపొందించబడిందన్నారు .ఈ కార్యక్రమంలో నాయకులు సందడి సురేందర్ రెడ్డి, యాదగిరి సురేందర్ ,కొప్పుల దినేష్ , చందు, ప్రవీణ్ , లక్ష్మణ్, సంతోష్, పరశురాం , మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా పన్నాల రాజేందర్‌రెడ్డి

మార్కెట్ నూతన పాలకవర్గంలో చైర్మన్, వైస్ చైర్మన్‌లతో డైరెక్టర్ పన్నాల రాజేందర్‌రెడ్డి

సరూర్‌నగర్, నవంబర్ 26 ప్రభాతవార్త: హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని బాలాపూర్ గ్రామానికి చెందిన పన్నాల రాజేందర్‌రెడ్డి నియమితులయ్యారు. కాంగ్రెస్ కిసాన్ సెల్ నాయకుడు, పార్టీలో సీనియర్ కార్యకర్త అయిన రాజేందర్‌రెడ్డికి ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గంలో డైరెక్టర్ పదవి లభించింది. ఈ నేపథ్యంలో ఇటీవల మలక్‌పేట్‌లోని శ్రీకృప మార్కెట్ (మహబూబ్‌మాన్షన్ గంజ్)లోనున్న హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో నూతన చైర్మన్ చెకోలేకర్ లక్ష్మీ శ్రీనివాస్, వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్, తోటి డైరెక్టర్లతో కలిసి పన్నాల రాజేందర్‌రెడ్డి మార్కెట్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అయితే తనకు ప్రతిష్టాత్మక హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పదవి దక్కినందుకు హర్షం వ్యక్తం చేస్తూ ఆయన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నాల ప్రభాకర్, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

సర్వే వంద శాతం పూర్తికి ప్రజలు సహకరించాలి

- కమిషనర్ సరస్వతి

సిబ్బందితో సమీక్ష చేస్తున్న బడంగ్‌పేట్ కమీషనర్ సరస్వతి

సరూర్‌నగర్, నవంబర్ 26 ప్రభాతవార్త:

బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో వంద శాతం సర్వే పూర్తికావడానికి ప్రజలు సహకరించాలని కమీషనర్ పి.సరస్వతి కోరారు. కార్పొరేషన్‌లో గత కొన్ని రోజులుగా జరుగుతున్న సమగ్ర కుటుంబానికి చెందిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ సర్వే, కుల గణనపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటి వరకు కార్పొరేషన్‌లో 87 శాతం సర్వేను పూర్తి చేయడం జరిగిందని వెల్లడించారు. ఇంకా సర్వే జరగని కుటుంబాలు వారు, డోర్ లాక్ చేసి అందుబాటులో లేని కుటుంబాల వారు 63032 12785 నెంబర్‌కు ఫోన్ చేసి సర్వే విషయమై సంప్రదించాలని ఆమె సూచించారు. ప్రజలందరూ ప్రభుత్వ సూచనల మేరకు బాధ్యతగా సర్వేకు సహకరించాలని సరస్వతి విజ్ఞప్తి చేశారు.

బడంగ్‌పేట్ స్మశానవాటిక అభివృద్ధికి నిధుల కేటాయింపు పట్ల కార్పొరేటర్ల హర్షం

స్మశానవాటికను సందర్శించిన బడంగ్‌పేట్ కార్పొరేటర్లు, నాయకులు

సరూర్‌నగర్, నవంబర్ 26 ప్రభాతవార్త:

బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని బడంగ్‌పేట్ స్మశానవాటిక అభివృద్ధి కోసం గతంలో కార్పొరేషన్ రూ.50 లక్షలు కేటాయించిన నేపథ్యంలో బడంగ్‌పేట్‌కు సంబంధించిన పలువురు కార్పొరేటర్లు, డివిజన్ల కీలక నాయకులు స్మశాన వాటికను సందర్శించారు. ఈ సందర్భంగా చేపట్టబోయే పనుల గురించి వారు చర్చించారు. అయితే స్మశానవాటిక అభివృద్ధికి నిధుల కేటాయింపుపై వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పెద్దబావి శ్రీనివాస్‌రెడ్డి, పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, సూర్ణగంటి అర్జున్, నాయకులు రాళ్ళగూడెం శ్రీనివాస్‌రెడ్డి, భీమిడి జంగారెడ్డి, గౌర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత..

నేరెడ్‌మెట్,నవంబర్26,ప్రభాతవార్త: సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఎంతోమంది పేదలకు లబ్ది జరుగుతుందని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలోని వినాయక్‌నగర్ డివిజన్‌కు చెందిన పలువురు అనారోగ్యంతో బాధపడుతూ సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్న రమణయ్యకు రూ. 32,000లు, యాదమ్మ కు రూ. 24వేలు, వసంత లక్ష్మి రూ. 17వేల 500ల చెక్కులను ఆయన అందించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్‌కు అర్హులైన వారి కోసం తమ క్యాంపు కార్యాలయంలో ప్రత్యేకంగా కౌంటర్‌ను ఏర్పాటు చేసి ఇద్దరు సిబ్బందిని నియమించడం జరిగిందన్నారు. నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి బద్దం పరుశరామ్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు తులసి సురేష్, కార్యదర్శి బాలక్రిష్ణ గుప్తా, ఫరీద్, కరీం, శ్రీనివాస్, గుత్తి రామ్‌చందర్, సాయి ముదిరాజ్, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలు

ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజ్యాంగ దినోత్సవంలో పాల్గొన్న ప్రిన్సిపల్ విజయ్‌కుమార్ తదితరులు

ఉప్పల్, నవంబరు 26 ప్రభాతవార్త : ఉప్పల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా.విజయ్‌కుమార్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ ప్రవేశిక ఔనత్యాన్ని, మౌళిక అంశాలను వివరించారు. సంక్షోభాలు, కేసులు, సవరణలు, సర్వోన్నత న్యాయస్థానం తీర్పులు తదితర అంశాలను వివరించారు. ప్రత్యేక రాజ్యాంగం రూపొందించాలనే ఆలోచనలతో ఎంఎన్‌రాయ్ వంటి ప్రముఖల ఆలోచనలతో బ్రిటీష్ పాలనా చట్టాల పునాధులపై రాజ్యాంగ పరిషత్ ఏర్పడిందని తెలిపారు. డా.బిఆర్.అంబేద్కర్ నేతృత్వంలో అత్యంత వ్యయ ప్రయాసలతో రూపొందించారని, భారత ప్రజలందరి పక్షాన అమోదించిన క్రమాన్ని వివరించారు. ప్రిన్సిపల్ విజయ్‌కుమార్ అధ్యక్షత వహించగా, ఎన్ఎస్ఎస్ అధికారి జల్దా విశ్వనాద్‌కుమార్ స్వయ నయం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డా.ఎ.రవిప్రసాద్, డా.ఎన్.రాజశ్రీ, డా.సత్య నారాయణ, డా.జి.తిరుపతయ్య, కె.గీత, ఎస్.యమున, డా.వి.శ్రీనివాసరావు, డా.ఆర్.చంద్రసాగర్ పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో పనిచేసే వారికి ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుంది : ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

మలక్ పేట ,నవంబర్ 26, ప్రభాతవార్త:

ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డికి పుష్ప గుచ్చాలను అందజేస్తున్న చైర్మన్ చేకోలేకర్ లక్ష్మీ ,చిత్రంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి చెకలేకర్ శ్రీనివాస్

కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పని చేసే నాయకులు, కార్యకర్తలకు ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మెన్ గా పదవి బాధ్యత చేపట్టిన చేకోలేకర్ లక్ష్మీ టి పి సి సి ప్రధాన కార్యదర్శి చెకొలేకర్ శ్రీనివాస్, డైరెక్టర్లు ప్రత్యూష, మహమ్మద్ షకిల్, కిషన్ సింగ్ తదితరులతో ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందజేసి శాలువాలతో సన్మానించగా, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి వారికి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ చేకోలేకర్ లక్ష్మి మాట్లాడుతూ రైతులకు ఎల్లవేళల అందుబాటులో ఉండి వారి సంక్షేమాన్ని కృషి చేస్తామని పేర్కొన్నారు. తనని మార్కెట్ కమిటీ చైర్మన్ గా నియమించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్‌లో నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఉప్పల్, నవంబరు 26 ప్రభాతవార్త :

ఉప్పల్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎఇ బి.కిరణ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఉప్పల్ సత్యనగర్, వెంకటేశ్వరకాలనీ, మైపిల్ హోటల్, భగాయత్ రోడ్డు, ధరణి రియల్ ఎస్టేట్, కాల భైరవ దేవాలయం, టిఎన్ఆర్ లేన్, నారాయణ స్కూల్, ఎజిఆర్ అపార్ట్‌మెంట్, హెచ్ఎండిఏ లేఅవుట్ ఏరియా తదితర ప్రాంతాల్లో ఉదయం పదిన్నర నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఎఇ తెలిపారు.

సర్వే వివరాల నమోదుకు మున్సిపల్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్

: కమిషనర్ అమరేందర్ రెడ్డి

తుర్కయంజాల్ నవంబర్ 26(ప్రభాతవార్త) ప్రభుత్వం ప్రతిష్టాత్మకం గా నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే వివరాలు అనివార్య కారణాలతో నమోదు చేయించుకోని వారి కోసం తుర్కయంజాల్ మున్సిపల్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు కమిషనర్ అమరేందర్ రెడ్డి ఒక తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని దాదాపు సర్వే పూర్తి కావచ్చిందన్నారు. సర్వే సమయంలో ఇంట్లో లేని, అనివార్య కారణాలతో సర్వే వివరాలు నమోదు చేయించుకోని వారు ఈ నెల 27,28 తేదీల్లోగా తమ సర్వే వివరాలను తప్పని సరిగా నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యాలయంలో హెల్ప్ డెస్క్ కూడా ఏర్పాటు చేశామన్నారు. 9014491650, 9866294894 ఫోన్లో సంప్రదించాలని ఆయన కోరారు.

రేపు రంగారెడ్డి జిల్లా సీనియర్ మహిళల కబడ్డీ జట్టు ఎంపిక

హుడాకాంప్లెక్, 26 నవంబరు ప్రభాతవార్త:

రంగారెడ్డి జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ మహిళలకు (75 కిలోల లోపు) రంగారెడ్డి జిల్లా జట్టు ఎంపిక రేపు (బుధవారం) సరూర్ నగర్ లోని ఇండోర్ స్టేడియం లో నిర్వహించబడునని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.రవి కుమార్, ప్రధాన కార్యదర్శి పి.సుధాకర్ రెడ్డి లు తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపిక అయిన క్రీడాకారి ఐలు తేదీ: 07122024నుండి 10122024వరకు లాల్ బహదూర్ స్టేడియం హైదరాబాద్ జిలా యందు నిర్వహించబడు 71వ అంతర్ జిల్లా కబడ్డీ పోటీలలో రంగారెడ్డి జిల్లా తరుపున పాల్గొం టారని తెలిపారు. ఇట్టి రంగారెడ్డి జిల్లా సీనియర్ మహిళా బడ్డీ జట్టు ఎంపిక పోటీలలో పాల్గొనా ల్సిందిగా వారు కోరారు. పోటీల్లో పాల్గొనే వారి ఆధార్ కార్డు మీ యొ